మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు


సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 90 వెల - రూ 5:00

తెలంగాణ జాతీయ దినపత్రిక

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad






- నితీన్ గడ్కరీకి ముఖ్యమంత్రి సీఎం రేవంత్ వినతి
- పెండింగ్‌లో ప్రాజెక్టులను త్వరగా క్లియర్ చెయ్యండి
- రావాల్సిన నిధులు వెంటనే మంజూరు చెయ్యండి
- కేంద్రమంత్రితో కలిసి పలుఅంశాలపై చర్చ
- రోడ్డు ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్
- హాజరైన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



## ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా

# ప్రకటించండి

న్యూఢిల్లీ,జూన్26 (ప్రజా మంటలు): రీజనల్ రింగ్ రోడ్డు సహా తెలంగాణలో రోడ్డు ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి కేందరమంత్రి నితన్ గడ్కరిని కోరారు. అనేక ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని త్వరగా క్లియర్ చేయాలని కోరారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కారీ తో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు బుధవారం సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన ప్రధాన సమస్యలపై చర్చించారు. ఈ భేటీకి సంబంధించిన అంశాలను మీడియాకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ క్రమంలో ఆర్ఆర్ఆర్ పై తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు. తెలంగాణకు కావాల్సిన రోడ్ల నెట్‌వర్క్‌కు కావాల్సిన అంశాలపై ప్రెజెంటేషన్ ఇచ్చినట్లు తెలిపారు. తెలంగాణలో రోడ్ల నెట్‌వర్క్ విస్తరణ పైన సుదీర్ఘంగా నితిన్ గడ్కరీతో చర్చించామని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు పనులు త్వరితగతిన చేపట్టే అంశంపై చర్చించామన్నారు. విజయవాడ రోడ్డును ఆరు లైన్లుగా మారుస్తామని ప్రకటించారు. హైదరాబాద్ కల్వకుర్తి రోడ్డుపై చర్చించామన్నారు. వారం రోజుల్లో అన్ని శాఖలతో కలిపి మరో సమావేశం పెడతామని తెలిపారు. అన్ని శాఖల నుంచి ఒకేసారి క్లియరెన్స్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.రిజనల్ రింగ్ రోడ్డుపై లోతుగా చర్చించామని.. వారు దానికి అంగీకరించారని వివరించారు. మిగతా 2లో..

## లోక్‌సభ స్పీకర్‌గా

# ఓం బిర్లా ఎన్నిక

**మూజువాణి ఓటుతో రెండోసారి బాధ్యతలు**

**అభినందించిన ప్రధాని మోడీ, విపక్షనేత రాహుల్**

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): లోక్‌సభ స్పీకర్‌గా మరోసారి ఓంబిర్లా గెలుపొందారు. బుధవారం జరిగిన ఓటింగ్‌లో ఇండియా కూటమి అభ్యర్థి కె.సురేశ్‌పై ఓం బిర్లా గెలుపొందారు. మూజువాణీ ఓటుతో ఓంబిర్లా విజయం సాధించినట్లు ప్రొటెం స్పీకర్ బర్తృహరి మహతాబ్ ప్రకటించారు. ఉదయం సభ ప్రారంభం కాగానే ఎన్డీయే కూటమి తరపున లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా పేరును ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదిస్తూ సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని రాజ్‌నాథ్ సింగ్ సహా మంత్రులు, ఎన్డీయే ఎంపీలు బలపరిచారు. మరోవైపు ఇండియా కూటమి తరపున కె.సురేశ్ పేరును శివసేన (యుబిటి) ఎంపీ అరవింద్ సావంత్ తీర్మానం చేశారు. దీన్ని పలువురు విపక్ష ఎంపీలు బలపర్చారు. అనంతరం స్పీకర్ పదవికి ఎన్నిక చేపట్టారు. మూజువాణీ ఓటుతో చేపట్టిన ఈ ఎన్నిక పక్రియలో ఓం బిర్లా విజేతగా నిలిచారు. స్పీకర్‌గా ఎన్నికైన ఓంబిర్లాకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అభినందనలు తెలిపారు. అనంతరం ఓంబిర్లాను మోదీ, రాహుల్, కిరణ్ రిజుజు మిగతా 2లో..

# నూతన నేర,న్యాయ చట్టాలు

**- జులై 1 నుంచే అమల్లోకి**

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): బ్రిటిష్ వలస పాలన నాటి చట్టాల స్థానంలో ఇటీవల కొత్తగా తీసుకొచ్చిన నేర న్యాయ చట్టాలు జులై 1నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. జీరో ఎఫ్ఐఆర్ ఆన్‌లైన్‌లోనే పోలీసు ఫిర్యాదు ఎలక్ట్రానిక్ రూపంలోనే సమన్లు, దారుణమైన నేరాలకు సంబంధించి నేరం జరిగిన ప్రదేశాన్ని తప్పనిసరిగా వీడియో చిత్రీకరించడం మిగతా 2లో..



# రేవంత్ నాయకత్వంలో పనిచేస్తా..

**రాహుల్ గాంధీ భవిష్యత్తు ప్రధాని - అధిష్టానం హామీతో సంతోషంగా ఉన్నా..**

**ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పష్టం.. ఢిల్లీలో ముగిసిన వివాదం**



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): జగిత్యాల కాంగ్రెస్ నేత, ఎమ్మెల్సీ జీవనరెడ్డి వ్యవహారం చివరకు చల్లబడింది. ఢిల్లీలో కేసీ వేణుగోపాల్‌ని కలిసి అసంతృప్తిని విన్నవించుకున్నారు జీవన్‌రెడ్డి.. కాంగ్రెస్ అధిష్టానం తనకు న్యాయం చేస్తుందన్న నమ్మకం ఉందన్నారు. పార్టీ కోసం కష్టపడి

## ఫిరాయింపులపై ఆనాడు కేసీఆర్ ను

# ఎందుకు నిలదీయలేదు?

**- కేటిఆర్ కు విప్ ఆది శ్రీనివాస్ సూటి ప్రశ్న**




హైదరాబాద్ (ప్రజా మంటలు): పార్టీ ఫిరాయింపులపై కేటీఆర్ ముసలి కన్నీరు కారుస్తున్నారని ప్రభుత్వ విప్, వేముల వాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన గాంధీభవన్లో మీడియాతో మాట్లాడారు. టీడీపీ ఎమ్మెల్యే తలసానిని మంత్రిగా చేసినప్పుడు కేసీఆర్ ను ఎందుకు కేటీఆర్ నిలదీయలేదని ప్రశ్నించారు. 2019లో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యే లను చేర్చుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ఎటు పోయిందో కేటీఆర్ చెప్పాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్లో చేరుతున్నారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కేసీఆర్ బంతి భోజనాలు చేస్తున్నాడని సెటైర్లు వేశారు.పార్టీ ఎమ్మెల్యేలకు కేసీఆర్



# రోడ్లు సరిగా లేనప్పుడు టోల్‌టాక్స్ ఎలా వసూలు చేస్తారు!

**- ఏజెన్సీలకు గడ్కరి సూటి ప్రశ్న - ప్రభుత్వం పట్ల వ్యతిరేకత వస్తుందని వ్యాఖ్య**

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): టోల్ ఛార్జీల వసూలు గురించి కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యా ఖ్యలు చేశారు. రోడ్లు సరిగా నిర్వహించలేనప్పుడు టోల్ వసూలు చేయొద్దని ఆయా ఏజెన్సీలకు మిగతా 2లో..




# మహారాష్ట్రలో జికా కలకలం

**- వైద్యుడు సహా కుమార్తెకు సోకిన వైరస్**

పుణె (ప్రజా మంటలు): మహారాష్ట్రలో జికా వైరస్ కలకలం రేపింది. పుణెకు చెందిన ఓ వైద్యుడు సహా ఆయన కుమార్తెకు ఇన్‌ఫెక్షన్ సోకినట్లు మిగతా 2లో..


# సమ్మె విరమించిన జూడాలు

- వారికి ఇచ్చిన హామీ మేరకు రెండు జివోలు విడుదల
- ఉస్మానియా,గాంధీ ఆసుపత్రుల్లో వసతి గృహాలు
- రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం



హైదరాబాద్ (ప్రజా మంటలు): తెలంగాణలో జూనియర్ మిగతా 2లో..

# ప్రజా నాడి




# అసాంజేకు విముక్తి..

**- సొంత దేశం ఆస్ట్రేలియాకు వెళ్లనున్న వికీలీక్స్ వ్యవస్థాపకుడు**



వాషింగ్టన్ (ప్రజా మంటలు): వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజేకు విముక్తి లభించింది. గూఢచర్యం ఆరోపణలను ఎదుర్కొంటూ ఇన్నాళ్లూ బ్రిటన్‌లో తలదాచుకున్న ఆయనను మిగతా 2లో..

# అమెరికా కీలక నిర్ణయం

**- ఉక్రెయిన్‌కు అమెరికా మిలటరీ కాంట్రాక్టర్ల తరలింపు**



న్యూయార్క్ (ప్రజా మంటలు): ఉక్రెయిన్‌కు సాయంగా అమెరికా కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. కీవ్‌కు మద్దతుగా అమెరికా మిలటరీ కాంట్రాక్టర్లను తరలించేందుకు బైడెన్ సర్కారు గ్రీన్ సిగ్నల్ మిగతా 2లో..

# మేడిగడ్డతో వేలకోట్లు నీటిపాలు

- ప్రాజెక్టు నిర్మాణం సరికాదని చెప్పినా వినలేదు
- డిజైన్‌కు అనుగుణంగా సాగని కట్టడం
- తెలంగాణ జనసమితినేత కోదండరామ్ వెల్లడి



హైదరాబాద్ (ప్రజా మంటలు): మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు కట్టడం మంచిది కాదని చెప్పినా గత భారాస ప్రభుత్వం పట్టించుకోలేదని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ రీ ఇంజినీరింగ్‌కు ముందు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సుజల స్రవంతి పేరుతో ప్రారంభించారు. మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు సరికాదని చెప్పినా భారాస ప్రభుత్వం ప్రాజెక్ట్ నిర్మాణానికి సిద్ధమైంది. ఆర్థికపరమైన అంశాల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని క్యాగ్ చెప్పింది. మేడిగడ్డ డిజైన్ ఒకటైతే.. నిర్మాణం మరో రకంగా చేయడంతో కుంగిపోయింది. ప్రాజెక్టు నిర్మాణ మెటీరియల్ సక్రమంగా లేదు, నిర్వహణ కూడా సరిగా లేదని డ్యాం సేఫ్టీ అధికారులు చెప్పారు. తుమ్మిడిహట్టి నుంచి కాలువల ద్వారా నీరు తీసుకురాగలిగితే గతంలో ఖర్చు చేసిన నిధులకు సార్థకత దక్కుతుంది. తుమ్మిడిహట్టిని పరిశీలించాలని ప్రభుత్వం, కమిషన్‌ను కోరాం. ఇంజినీర్ల సూచనలను గత ప్రభుత్వం బేఖాతరు చేసింది. మేడిగడ్డ ప్రాజెక్టులో అవినీతికి పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలి. విచారణ కమిషన్ వేయాలని కోరిందే భారాస. కమిషన్ వేస్తే వాస్తవాలు బయటకు వస్తాయని అసెంబ్లీలో ఆ పార్టీ కోరింది. ప్రజల సొమ్మును మిగతా 2లో..



# హైదరాబాద్‌లో నీటి సరఫరాకు అంతరాయం

హైదరాబాద్ (ప్రజా మంటలు): నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని అధికారులు తెలిపారు. కృష్ణా ఫేజ్-2 పంపుహౌజ్ మరమ్మతుల కారణంగా కొన్ని చోట్ల పూర్తిగా, మరి కొన్ని చోట్ల పాక్షికంగా నీటి సరఫరా నిలిపివేయనున్నట్టు జల మండలి అధికారులు వెల్లడించారు. ఎల్బీనగర్, బాలాపూర్, సికింద్రాబాద్, బేగంపేట్, ఉప్పల్, రామంతపూర్, బుద్వేల్, శంషాబాద్ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయమేర్పడనుంది.

మొదటి పేజీ తరువాయి

# ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించండి



విజయవాడ - హైదరాబాద్ రోడ్డుకు టెండర్లను పిలిచేందుకు అంగీకరించారని చెప్పారు. హైదరాబాద్ - కల్వకుర్తి రోడ్డు, ఇతర రోడ్లపై చర్చ జరిగిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కావాల్సిన అన్ని సహాయక సదుపాయాలు కలిపిస్తామని నితిన్ గడ్కారీకి చెప్పామని అన్నారు. వారం రోజుల్లో హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తున్న నితిన్ గడ్కారీకి ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ధన్యవాదాలు తెలిపారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో పలు విషయాలపై చర్చించామని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. రోడ్లు, భూ సమస్యలను బీఆర్ఎస్ ప్రభుత్వం పరిష్కరించలేదని మండిపడ్డారు. హైదరాబాద్, అమరావతి రెండు రాజధానుల మధ్య ఆరు లైన్ల రోడ్డు నిర్మిస్తున్నామని ... రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. అలాగే ఎక్స్‌ప్రెస్‌వే కూడా నిర్మిస్తామని చెప్పారు. శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తామన్నారు. ఎన్నికలు అయిపోయాయి, రాజకీయాలు పక్కనపెట్టి అభివృద్ధి కోసం పని చేస్తామని స్పష్టం చేశారు. చాలా రోడ్ల సమస్యలపైన ఈరోజు క్లారిటీ వచ్చిందన్నారు. ఉప్పల్ ఘట్‌కేసర్ ఫ్లై ఓవర్‌ను ఏడాదిన్నరలో పూర్తి చేస్తామని వివరించారు. తెలంగాణ అభివృద్ధి మాత్రమే ముఖ్యమని.. తమ మధ్య ఎలాంటి రాజకీయాలు లేవని, అందరం బాగానే ఉన్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

**తెలంగాణకు రావాల్సిన నిధులు ఇవ్వండి:కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భేటి**

కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులను సాధించడమే తమ లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. అందుకోసమే వరుసగా కేంద్రమంత్రులను కలుస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని వివిధ రహదారుల ప్రాజెక్టుల విషయమై దిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో చర్చించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. జాతీయ రహదారులకు సంబంధించి గత అయిదేళ్లలో తెలంగాణకు అతి తక్కువ నిధులు వచ్చాయి. భూసమీకరణ, ఇతర అంశాలను అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. దాంతో పనులు ఆగిపోయాయి. 2016లో ప్రకటించిన రీజినల్ రింగ్‌రోడ్డును మరిచిపోతే మా ప్రభుత్వం వచ్చిన తరువాత కదలిక తీసుకొచ్చాం. యుటిలిటీ ఛార్జీలను భరిస్తామని చెప్పాం. కేంద్రమంత్రి గడ్కరీ స్పందించి తామే భరిస్తామని భరోసా ఇచ్చారు. 50-50 షేరింగ్‌లో భూసమీకరణ ప్రారంభించాలని తాజా సమావేశంలో నిర్ణయించామని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు ఉపయోగకరమైన 6 లేన్ గురించి కూడా చర్చించాం. రెండేళ్లలోపే విజయవాడ-హైదరాబాద్ మార్గాన్ని రూ.4వేల కోట్ల బ్జడెట్‌తో పూర్తి చేయనున్నామని, ఏపీ విభజన చట్టం ప్రకారం గ్రీన్‌ఫీల్డ్ హైవేకు రూపకల్పన చేస్తున్నట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. అన్ని వినతులపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. తెలంగాణకు రావాల్సిన నిధులన్నీ సాధించడమే మా లక్ష్యం. జవాబుదారీతనంగా పని చేయడం మాకు తెలుసు కాబట్టే ఇంత మంది మంత్రులం దిల్లీకి వచ్చి మాట్లాడుతున్నాం. ఉప్పల్-ఘట్‌కేసర్ రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్న నేపథ్యంలో వాటిని త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం' అని కోమటిరెడ్డి తెలిపారు.

# మహారాష్ట్రలో జికా కలకలం

## - వైద్యుడు సహా కుమార్తెకు సోకిన వైరస్

నిర్ధరణ అయ్యింది. అయితే, వారి పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.ఒకే ఇంట్లో రెండు కేసులు నమోదుకావడంతో అప్రమత్తమైన వైద్యాధికారులు.. ఆ ప్రాంతంలో వైరస్ వ్యాప్తి నివారణ చేపట్టారు.పుణెకి చెందిన ఓ వైద్యుడు ఇటీవల జ్వరం బారిన పడ్డాడు. శరీరంపై దద్దుర్లు రావడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. రక్త నమూనాలు సేకరించి విశ్లేషణ కోసం ఆ నగరంలోనే ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపించారు. జూన్ 21న వారికి జికా ఇన్‌ఫెక్షన్ నిర్ధరణ అయినట్లు స్థానిక మునిసిపల్ కార్పొరేషన్ వెల్లడించింది. అనంతరం అతడి కుటుంబ సభ్యులకు రక్త పరీక్షలు నిర్వహించారు. దాంట్లో ఆయన కుమార్తె (15)కు వైరస్ సోకినట్లు తేలింది. వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరీక్షిస్తున్నారు. జికా వైరస్ సోకిన ఆడ ఎడిస్ దోమ కుట్టడం ద్వారా వ్యాధి సంక్రమిస్తుంది. జ్వరం, చర్మంపై దద్దుర్లు, కండరాలు, కీళ్ల నొప్పులు, తలనొప్పి, జీర్ణకోశ సంబంధ సమస్యలు, గొంతు నొప్పి, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వైరస్‌ను తొలిసారి 1947లో ఉగాండా అడవుల్లోని ఓ కోతిలో గుర్తించారు. ఆ తర్వాత ఆఫ్రికన్ దేశాలతోసహా భారత్, ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పైన్స్, థాయ్‌లాండ్, వియత్నాం లాంటి ఆసియా దేశాల్లోనూ ఈ వ్యాధి ప్రబలింది. మొత్తంగా 2016 నాటికి 39 దేశాల్లో వ్యాధి ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది.

# అసాంజేకు విముక్తి..

విడిచిపెట్టాలని అమెరికా న్యాయస్థానం తీర్పు వెలువరించింది. దీంతో ప్రత్యేక విమానంలో ఆయన తన సొంత దేశం ఆస్ట్రేలియాకు చేరుకోనున్నారు.అంతకుముందు అమెరికా న్యాయ విభాగంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం.. గూఢచర్యం చట్టానికి విరుద్ధంగా జాతీయ భద్రతకు సంబంధించిన కీలక సమాచారాన్ని పొందడం, వ్యాప్తి చేయడం వంటి నేరాలకు పాల్పడినట్లు కోర్టులో అసాంజే అంగీకరించారు. మూడు గంటల పాటు జరిగిన విచారణలో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం ప్రసాదించిన వాక్ స్వాతంత్ర్యాన్ని తాను విశ్వసిస్తానంటూ పరోక్షంగా తన చర్యలను సమర్థించుకున్నారు. ఒక జర్నలిస్టుగా రహస్య పత్రాలను సేకరించి ప్రచురించినట్లు వెల్లడించారు. భావ ప్రకటనా స్వేచ్ఛలో భాగంగానే తాను ఈ పని చేసినట్లు వెల్లడించారు. కానీ, అది గూఢచర్య చట్టానికి విరుద్ధమని అంగీకరిస్తున్నానని పేర్కొన్నారు.ఈ కేసును విచారించిన యూఎస్ డిస్ట్రిక్ట్ చీఫ్ జడ్జి జస్టిస్ రమొనా వి.మంగ్లోనా.. అసాంజే నేరాంగీకారానికి ఆమోదం తెలిపారు. ఇప్పటికే బ్రిటన్‌లో గడిపిన నిర్బంధ కాలాన్ని శిక్షగా పరిగణిస్తూ విడుదల చేస్తున్నట్లు తీర్పు వెలువరించారు. యూకే, యూఎస్‌లోని ఆస్ట్రేలియా రాయబారులతో కలిసి ఆయన కాన్‌బెర్రాకు ప్రత్యేక విమానంలో బయలుదేరారు. యూఎస్‌కు చెందిన ఉత్తర మారియానా ద్వీపం రాజధాని అయిన సైపన్‌లో ఉన్న కోర్టులో అసాంజే విచారణకు హాజరయ్యారు. అమెరికాకు రావడానికి ఆయన నిరాకరించడం వల్లే విచారణ అక్కడ చేపట్టారు. పైగా ఆ భూభాగం ఆస్ట్రేలియా సమీపంలో ఉంటుంది.అసాంజే అమెరికా న్యాయవిభాగం మధ్య కుదిరిన ఒప్పందాన్ని ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్ స్వాగతించారు. ఇది సున్నితమైన అంశమైన నేపథ్యంలో దీనిపై మరిన్ని వ్యాఖ్యలు చేయలేమని పేర్కొన్నారు. ఈ కేసులో ఓ సానుకూల పరిణామం కోసం ప్రభుత్వం తరఫున అన్ని ప్రయత్నాలు చేశామని తెలిపారు. కేసు పూర్వాపరాలను పక్కనపెడితే.. విచారణ మాత్రం చాలా సుదీర్ఘంగా కొనసాగిందని అభిప్రాయపడ్డారు. అసాంజేను మరింతకాలం బందీగా ఉంచడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని స్పష్టమైందన్నారు.

# అమెరికా కీలక నిర్ణయం



ఇచ్చేలా సన్నాహాలు చేస్తోంది.దీంతో ఇప్పటివరకు అమల్లో ఉన్న అప్రకటిత నిషేధాన్ని తొలగించనున్నట్లు సీఎన్ఎన్ కథనంలో పేర్కొంది. ఉక్రెయిన్ పాలసీకి సంబంధించి అమెరికా ప్రభుత్వం తీసుకొన్న అత్యంత కీలక నిర్ణయాల్లో ఇది కూడా ఒకటిగా నిలవనుంది. రష్యా సైన్యంపై కీవ్ ఆధిపత్యం సాధించేందుకు ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని భావిస్తోంది.ఈ ప్రతిపాదనకు ఒక్కసారి ఆమోదముద్ర పడితే.. ఈ ఏడాదే అమల్లోకి రావచ్చు. దీంతో పెంటగాన్‌లోని పలు అమెరికా కంపెనీలు ఉక్రెయిన్ సైన్యానికి మద్దతుగా అక్కడ పని చేసేందుకు అనుమతి ఇవ్వనుంది. దెబ్బతిన్న ఉక్రెయిన్ ఆయుధ వ్యవస్థల మరమ్మతులు, నిర్వహణను వేగవంతం చేసే అవకాశం ఈ నిర్ణయంతో లభిస్తుంది.దాదాపు రెండేళ్లుగా బైడెన్ సర్కారు అమెరికా జాతీయులను, సైనికులను ఉక్రెయిన్ సరిహద్దుల్లోకి పంపించేందుకు తటపటాయిస్తోంది. అంతేకాదు.. తమతో అమెరికా మిలటరీ నేరుగా తలపడిందన్న భావన రష్యా వారికి కలగకూడదని ఇన్నాళ్లూ వేచి చూసింది. ముఖ్యంగా విదేశాంగశాఖ కూడా ఈ విషయంలో విముఖంగానే ఉంది. దీంతో ఇన్నాళ్లు అమెరికా ఇచ్చిన ఆయుధ వ్యవస్థలు దెబ్బతిన్న సందర్భాల్లోను వాటిని పోలాండ్, రొమానియా, లేదా సమీపంలోని ఇతర నాటో దేశాలకు తరలించాల్సి రావడంతో తీవ్ర జాప్యం చోటుచేసుకొంటోంది. ఇక అమెరికా దళాలు వీటి రిపేర్లకు ఉక్రెయిన్ సేనకు వీడియో కాల్స్ లేదా సెక్యూర్ ఫోన్ల ద్వారానే సాయం చేస్తున్నాయి.ఇటీవల కాలంలో రష్యా దళాలు క్రమంగా ముందుకుసాగడం.. ఉక్రెయిన్‌కు అందాల్సిన నిధులను కాంగ్రెస్‌లో చాలాకాలం నిలిపేయడం వంటి సమస్యలు మొదలయ్యాయి. దీంతో ప్రభుత్వ నిధులతో పనిచేసే కాంట్రాక్టర్లను అక్కడకు పంపి ఆయుధాల మరమ్మతులు చేపట్టాలని భావిస్తున్నారు. దీనికి ఈ ఏడాది చివర్లో అమెరికా ఎఫ్-16 కీవ్‌కు చేరనుండటంతో వాటి నిర్వహణకు కూడా ఈ సిబ్బంది ఉపయోగపడనున్నారు. తమ ఆయుధాలతో రష్యా భూభాగంపై కీవ్ దాడులు చేయవచ్చని మే నెలలో బైడెన్ సర్కారు అనుమతి ఇచ్చింది. ఆ తర్వాత నెల రోజుల్లోనే మిలటరీ కాంట్రాక్టర్లను పంపే ప్రతిపాదనను పరిశీలించడం గమనార్హం. దీనిపై అమెరికా అధికారులు మాట్లాడుతూ ముందే స్పందించడం తొందరపాటవుతుందన్నారు.

## సమ్మె విరమించిన జూడాలు

డాక్టర్లు సమ్మె విరమించారు. రాష్ట్ర ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలం కావడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. తమ డిమాండ్లపై వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇవ్వడంతో జూడాలు సమ్మె విరమణకు అంగీకరించారు.ఎనిమిది డిమాండ్లలో ఆరింటికి మంత్రి సానుకూలత వ్యక్తం చేశారు. అంతకుముందు తెలంగాణ ప్రభుత్వం రెండు జీవోలను జారీ చేసింది. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల జూడాల వసతిగృహాల నిర్మాణానికి జీవో విడుదల చేసింది. కాకతీయ వైద్య కళాశాలలో రహదారుల పునరుద్ధరణకు నిధులు విడుదల చేస్తూ జీవో జారీ చేసింది. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులతో పాటు కాకతీయ వర్సిటీకి రూ.204.85 కోట్లు కేటాయించింది. ఉస్మానియా వసతి భవనాలు, రోడ్లకు రూ.121.90 కోట్లు, గాంధీ ఆసుపత్రికి 79.50 కోట్లు, కాకతీయ వర్సిటీలో సీసీ రోడ్లకు రూ.2.75 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఉస్మానియా,గాంధీ ఆసుపత్రుల్లో వసతి గృహాలు

హైదరాబాద్(జనంసాక్షి):జూనియర్ డాక్టర్లకు ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ప్రభుత్వం రెండు జీవోలను జారీ చేసింది. ఉస్మానియా,గాంధీ ఆసుపత్రుల జూడాల వసతిగృహాల నిర్మాణానికి జీవో విడుదల చేసింది. కాకతీయ వైద్య కళాశాలలో రహదారుల పునరుద్ధరణకు నిధులు విడుదల చేస్తూ జీవో జారీ చేసింది. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులతో పాటు కాకతీయ వర్సిటీకి రూ.204.85 కోట్లు కేటాయించింది. ఉస్మానియా వసతి భవనాలు, రోడ్లకు రూ.121.90 కోట్లు, గాంధీ ఆసుపత్రికి 79.50 కోట్లు, కాకతీయ వర్సిటీలో సీసీ రోడ్లకు రూ.2.75 కోట్లు మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది. మరోవైపు గాంధీ ఆసుపత్రిలో జూడాలు సమావేశమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలల నుంచి హాజరయ్యారు. వైద్యారోగ్యశాఖ మంత్రి, ఉన్నతాధికారులతో మరోసారి సమావేశమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జూడాలు తమ డిమాండ్లపై అంతర్గత చర్చలు జరుపుతున్నారు. సమ్మెను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు జూనియర్ డాక్టర్లు (జూడా) ప్రకటించిన విషయం తెలిసిందే. డీఎంఈ, ఆరోగ్య శాఖ అధికారులతో మంగళవారం అర్ధరాత్రి వరకు వారు చర్చలు జరిపారు. ఈక్రమంలో గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో జూడాల వసతి భవనాల ఏర్పాటుకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. కాకతీయ వర్సిటీలో రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామని తెలిపింది. బుధవారం ఇందుకు సంబంధించి రెండు జీవోలు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. జీవోలు విడుదల కాకపోతే మళ్లీ సమ్మె కొనసాగిస్తామని జూడాలు స్పష్టం చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వం తాజాగా రెండు జీవోలు విడుదల చేసింది.



# లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా ఎన్నిక

సాదరంగా సభాపతి స్థానం వద్దకు తీసుకెళ్లి స్పీకర్ కుర్చీలో కూర్చోబెట్టారు. స్పీకర్ పదవికి ఈ సారి ఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. స్పీకర్ ఎన్నికను ఏకగ్రీవం చేసేందుకు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు ప్రతిపక్షాలతో జరిపిన చర్చలు ఫలించలేదు. డిప్యూటీ స్పీకర్ పదవిని ఇవ్వాలన్న షరతుకు ప్రభుత్వం అంగీకరించకపోవడంతో స్పీకర్ స్థానానికి విపక్ష ఇండియా కూటమి అభ్యర్థిని నిలిపింది. ఇండియా కూటమి తరఫున సీనియర్ ఎంపీ కొడికున్నిల్ సురేశ్ బరిలో నిలిచారు. దీంతో గత 50 ఏండ్లలో తొలిసారిగా, స్వతంత్ర భారత చరిత్రలో మూడోసారి లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక జరిగింది. ఈ క్రమంలో 18వ లోక్‌సభ స్పీకర్‌గా మరోసారి బీజేపీ ఎంపీ ఓం బిర్లా ఎన్నికయ్యారు. వరుసగా రెండోసారి లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికై చరిత్ర సృష్టించారు. బుధవారం లోక్‌సభలో జరిగిన ఎన్నిక పక్రియలో ఇండియా కూటమి అభ్యర్థిపై మూజువాణి ఓటుతో విజయం సాధించారు. ఓం బిర్లా కోటా-బుంది లోక్‌సభ స్థానం నుంచి మూడోసారి ఎంపీగా ఎన్నికయ్యారు. 2019లో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని మోదీ 2.0 ప్రభుత్వంలో లోక్‌సభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈసారి కూడా ఉన్‌డిఎ ఆయనను లోక్‌సభ స్పీకర్ అభ్యర్థిగా ప్రకటించింది. ఇతర పార్టీలు కూడా బయటి నుండి ఓం బిర్లాకు మద్దతు పలికారు. దీంతో ఓం బిర్లా రెండవసారి లోక్‌సభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఓం బిర్లా వరుసగా రెండు పర్యాయాలు లోక్‌సభ స్పీకర్‌గా పనిచేసిన రాజస్థాన్‌కు చెందిన బలరాం జాఖర్‌తో సమానంగా నిలిచి చరిత్ర సృష్టించారు. ఇప్పటి వరకు లోక్‌సభ స్పీకర్‌గా వరుసగా రెండుసార్లు ఎన్నికై తన పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న ఏకైక లోక్‌సభ స్పీకర్‌గా బలరాం జాఖర్ నిలిచారు. తెలుగు వారైన నీలం సంజీవరెడ్డి, జిఎంసి బాలయోగి వంటి అనుభవజ్ఞులైన నాయకులు, సంగ్మా కూడా రెండుసార్లు లోక్‌సభ స్పీకర్ అయినప్పటికీ 5 సంవత్సరాల పదవీకాలాన్ని పూర్తి చేయలేకపోయారు. బలరామ్ జాఖర్ 1980 నుండి 1985 వరకు తిరిగి 1985 నుండి 1989 వరకు తన రెండు పర్యాయల పదవీకాలాన్ని పూర్తి చేశారు. ఇక రెండు పర్యాయాలు లోక్‌సభ చేసిన వారిలో ఎం.ఏ. అయ్యంగార్ ప్రథముడు. స్వాతంత్ర భారత దేశంలో మొట్ట మొదటి లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ అయిన అయ్యంగార్, మార్చి 8, 1956 నుండి మే 10, 1957 వరకు స్పీకర్‌గా పనిచేశారు. ఆపై మళ్లీ మే 11, 1957 నుండి ఏప్రిల్ 16, 1962 వరకు ఎన్నికయ్యారు. లోక్‌సభ తొలి స్పీకర్ గణెశిష్ వాసుదేవ్ మావలంకర్ మరణం తర్వాత అయ్యంగార్ తొలిసారి స్పీకర్ అయ్యారు. అయ్యంగార్ సభాపతిగా ఆమోదించిన మైలురాయి చట్టాలలో వరకట్న నిషేధ చట్టం ఒకటి. ఇక తర్వాత డాక్టర్ గుర్దియాల్ సింగ్ ధిల్లాన్ ఆగస్టు 8, 1969న మొదటిసారిగా లోక్‌సభ స్పీకర్ అయ్యారు. మార్చి 17, 1971 వరకు ఆ స్థానంలో కొనసాగారు. స్పీకర్‌గా అతని రెండవ పదవీకాలం మార్చి 22, 1971న ప్రారంభమై డిసెంబర్ 1, 1975 వరకు కొనసాగింది.

ఓం బిర్లా విషయానికి వస్తే, ఇప్పటివరకు పోటీ చేసిన ఆరు ప్రధాన ఎన్నికల్లో అజేయంగా నిలిచారు. 2019లో బీజేపీ ఆయనను లోక్‌సభ స్పీకర్‌గా చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. రెండోసారి ఎంపీ అయిన బిర్లా లోక్‌సభ స్పీకర్ కావడం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఇక మరోసారి ఓం బిర్లాను ఎన్డీయే అభ్యర్థిని చేసింది.

# నూతన నేర,న్యాయ చట్టాలు

## - జులై 1 నుంచే అమల్లోకి

వంటివి కీలక అంశాలు ఇందులో ఉండనున్నాయి. ఈ కొత్త చట్టాల ప్రకారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లనవసరం లేకుండానే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే వీలు కలుగనుంది. తద్వారా తేలికగా, వేగంగా సమస్యను తెలియజేయడంతోపాటు పోలీసుల స్పందనను సులభతరం చేస్తుంది. ఏదైనా ఘటనకు సంబంధించిన సమాచారాన్ని ఏ పోలీస్ స్టేషన్‌కైనా ఆన్‌లైన్‌లో తెలియజేయవచ్చు. జీరో ఎఫ్ఐఆర్ ప్రకారం.. ఏ వ్యక్తి అయినా పోలీసుస్టేషన్ పరిధితో సంబంధం లేకుండా ఏ పోలీస్ స్టేషన్లోనైనా ఫిర్యాదు చేయవచ్చు. బాధితులతోపాటు నిందితులు కూడా ఎఫ్ఐఆర్ కాపీలను ఉచితంగా పొందే వీలుంది. వీటితోపాటు పోలీస్ రిపోర్టు, ఛార్జిషీట్, స్టేట్‌మెంట్లు, ఇతర డాక్యుమెంట్లను 14 రోజుల్లోగా పొందవచ్చు. అరెస్టు సందర్భాల్లో బాధితుడు తమ సన్నిహితులు, బంధువులకు ఆ పరిస్థితిని తెలియజేసే హక్కు ఉంటుంది. తద్వారా తక్షణ సహాయం పొందేందుకు వీలు కలుగుతుంది. అరెస్టుకు సంబంధించిన వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌తోపాటు జిల్లా హెడ్ క్వార్టర్లలోనూ బహిరంగంగా ప్రదర్శిస్తారు. తద్వారా అరెస్టు సమాచారాన్ని బాధితుల కుటుంబీకులు, స్నేహితులు తేలికగా తెలుసుకునే వీలుంటుంది. కేసు, దర్యాప్తును పటిష్ఠంగా నిర్వహించేందుకు గాను తీవ్రమైన నేరాల్లో ఫోరెన్సిక్ నిపుణులు తప్పనిసరిగా ఘటనా స్థలాన్ని పరిశీలించాల్సి ఉంటుంది. దీంతోపాటు సాక్ష్యాలను తారుమారు చేయడాన్ని నిరోధించేందుకు నేరం జరిగిన ప్రాంతంలో ఆధారాలను సేకరించే క్రమాన్ని తప్పనిసరిగా వీడియో చిత్రీకరించాలి. చిన్నారులు, మహిళలపై జరిగే నేరాల్లో సాధ్యమైనంత త్వరగా దర్యాప్తు పూర్తి చేయాలని ఈ కొత్త చట్టాలు చెబుతున్నాయి. పిల్లలు, మహిళలపై నేరాల్లో బాధితులకు ప్రాథమిక చికిత్స లేదా పూర్తి వైద్యం ఉచితంగా అందించాల్సి ఉంటుంది. ఆపద సమయంలో వారి ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు త్వరగా కోలుకోవాలనేది ఉద్దేశం. ఆన్‌లైన్‌లోనే సమన్లు జారీ చేయడం.. తద్వారా పేపర్ వర్క్‌ను తగ్గించి, అన్ని భాగస్వామ్య పక్షాల మధ్య సమాచారం అందించేలా ఈ చట్టాన్ని రూపొందించారు. మహిళలపై కొన్ని నేరాలకు సంబంధించి.. బాధితురాలి స్టేట్‌మెంట్‌ను మహిళా మేజిస్ట్రేట్ ముందు నమోదు చేయాల్సి ఉంటుంది. వారు లేనిపక్షంలో మహిళాసిబ్బంది సమక్షంలో పురుష మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచాలి. కేసు విచారణలో అనవసర జాప్యాన్ని నివారించడానికి కోర్టులు గరిష్ఠంగా రెండు వాయిదాలు మాత్రమే మంజూరు చేస్తాయి. సాక్షుల భద్రతను, వారి సహకారాన్ని దృష్టిలో ఉంచుకొని సాక్షుల పరిరక్షణ పథకాన్ని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా అమలు చేయాలి. అత్యాచార నేరాల కేసుల్లో బాధితురాలి వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో ద్వారా పోలీసులు నమోదు చేయాలి. మహిళలు, దివ్యాంగులు, దీర్ఘకాల వ్యాధిగ్రస్థులతోపాటు 15ఏళ్ల లోపు పిల్లలు, 60ఏళ్ల కంటే ఎక్కువ వయసున్న వారు పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం నుంచి మినహాయింపు ఉంటుంది. వారు నివాసమున్న చోటే పోలీసుల సాయం పొందవచ్చు. స్వల్ప నేరాలకు సంబంధించి నేరస్థులకు సమాజసేవ చేసే అవకాశాన్ని కొత్త చట్టాలు కల్పిస్తున్నాయి. తమ తప్పిదాలను తెలుసుకోవడంతోపాటు సామాజిక బాధ్యతను పెంపొందించేలా వీటిని రూపొందించారు. న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని పెంపొందించడంతోపాటు వేగంగా కేసుల పరిష్కారం అందించే ఉద్దేశంతో బ్రిటిష్ కాలం నాటి ఐపీసీ, సీఆర్‌పీసీ, ఐఈఏ (భారతీయ సాక్ష్యాధార చట్టం) చట్టాల స్థానంలో భారతీయ న్యాయ సంహిత 2023, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత 2023, భారతీయ సాక్ష్య అధినియమ్ 2023 పేరుతో మూడు చట్టాలను కేంద్ర ప్రభుత్వం రూపొందించిన సంగతి తెలిసిందే.

## మేడిగడ్డతో వేలకోట్లు నీటిపాలు

ఏ ప్రభుత్వమైనా బాధ్యతగా ఖర్చు చేయాలి. విచారణ కమిటీని రద్దు చేయించి.. వాస్తవాలు బయటకు రాకుండా చేయాలని చూస్తున్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ తమపైన ఉన్న కేసులను ఎత్తివేయాలని కోరడం బాధ్యతారాహిత్యం. భారాస పాలనలో మాపై నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరుతున్నా. బొగ్గు గనులను వేలం వేయడమంటే అది ప్రైవేటీకరణకు దారి తీస్తుంది. బొగ్గు గనులను సింగరేణికే అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా' అని కోదండరాం తెలిపారు.



# ప్రతిపక్షహోదా కోసం లేక రాయడం సిగ్గుచేటు

## టిడిపి ఎమ్మెల్యే మాధవీరెడ్డి ఎద్దేవా

అమరావతి,జూన్26 (ప్రజా మంటలు):

ప్రతిపక్ష హోదా కోసం వైకాపా అధ్యక్షుడు జగన్ స్పీకర్‌కు లేఖ రాయడం సిగ్గుచేటని తెదేపా ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి ఎద్దేవా చేశారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కనీస అవగాహన లేకుండా జగన్ ప్రతిపక్ష హోదా కోరడం హేయమైన చర్య అన్నారు. మొత్తం సభ్యుల్లో 1/10 వంతు ఉంటేనే ఆ హోదా వస్తుందన్న విషయం కూడా ఆయనకు తెలియకపోవడం బాధాకరమన్నారు. ప్రజల వద్దకు వెళ్లి ముఖం చూపించుకోలేక కుయుక్తులకు తెరలేపారని విమర్శించారు. స్పీకర్ ఎన్నిక రోజు వైకాపా ఎమ్మెల్యేల్లో ఒక్కరూ అసెంబ్లీకి రాలేదన్నారు. ఆరుగురు శాసన సభ్యులను పీకేస్తే తెదేపా ప్రతిపక్ష హోదాను కోల్పోతుందని మీరన్న మాటలు మరిచిపోయారా జగన్?. ముఖ్యమంత్రి అయితేనే అసెంబ్లీలోకి వస్తారా? ప్రజలు మీకు ఓట్లు వేసింది ఎందుకు? మీ నియోజకవర్గ ప్రజల సమస్యలు మీకు పట్టవా? ఇకనైనా జగన్ అధికార భ్రాంతి నుంచి బయటకు రావాలి. ఆయన పాలనలో నష్టపోని వ్యక్తి లేడు. ఎన్నికల్లో జగన్‌కు ప్రజలు 11 సీట్లు ఇచ్చి బుద్ధి చెప్పడంతో ఇప్పుడు ప్రతిపక్ష హోదా అంటూ కొత్త నాటకాలకు తెరలేపారు‘ అని మాధవీరెడ్డి మండిపడ్డారు.

# జగన్‌కు రూల్స్ కూడా తెలియవు

**ప్రతిపక్షనేత హోదా ఇస్తే రాదు**

**ప్రజలు తగిన మెజార్టీ ఇస్తేనే వస్తుంది**

**సలహాలు ఇచ్చేవారిని మార్చుకుంటే మంచిది**

**సభవ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శలు**

అమరావతి,జూన్26 (ప్రజా మంటలు):

జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేత హోదా తాము కాదని ప్రజలే ఇవ్వలేదని శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. జగన్మోహన్ రెడ్డి తనకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలంటూ రాసిన లేఖపై స్పందించారు. జగన్‌మోహన్ రెడ్డి తప్పుడు సమాచారంతో లేఖలు రాశారని ఆయన రూల్ బుక్ చదవాలని సూచించారు. ఆయన చదవకపోతే మనుషుల్ని పెట్టి చదివించు కోవాలన్నారు. లేఖ రాసిన సలహాదారుడ్ని కూడా మార్చుకోవాలని అందులో అన్నీ తప్పులే ఉన్నాయన్నారు. గతంలో పదిశాతం ఎమ్మెల్యేలు లేకపోయినా పి జనార్ధన్ రెడ్డిని ప్రతిపక్షనేతగా గుర్తించారంటూ లేఖలో రాశారని.. తెలియకపోతే తెలుసుకోవాలన్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీ పక్ష నేత మాత్రమేనన్నారు. ప్రధాన ప్రతిపక్షహోదా ఇవ్వలేదన్నారు. లోక్‌సభలో పి ఉపేంద్రను ప్రతిపక్షనేతగా గుర్తించారని జగన్ చెప్పడం కూడా తప్పేనన్నారు. సభలో కోరానికి తగ్గ బలం ఉంటేనే ప్రతిపక్ష నేత హోదా ఇస్తారని పయ్యావుల స్పష్టం చేశారు. వైసీపీ పక్ష నేతగా ప్రతిపక్షంగా జగన్ ఉంటారని.. కానీ ప్రధాన ప్రతిపక్ష నేతగా గుర్తింపు మాత్రం ఉండదన్నారు. ప్రధాన ప్రతిపక్ష నేతకు కేబినెట్ హోదా ఉంటుందని ఆ హోదా కోసమే జగన్ లేఖలు రాస్తున్నారని పయ్యావుల విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు సలహా దారులను పెట్టుకోని నీకు ఈ గతి పట్టింది జగన్.. మళ్లీ అదే సలహాదారులతో స్పీకర్‌కు లేఖ రాసినట్లు ఉన్నావు.. ఇలాగే ఉంటే నీ రాజకీయం ఇంకా దారుణంగా ఉంటుందని సలహా ఇచ్చారు. సఎం తర్వాత ప్రతిపక్షనేత ప్రమాణ స్వీకారం చేయాలని అన్న జగన్‌కు అసలు సభ నియమాలు తెలుసా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష హోదాలో ఉండేందుకు కనీస మెజార్టీ ఎమ్మెల్యేలు కూడా లేని వైసీపీ.. ప్రతిపక్ష హోదా ఇవ్వాలని ఎలా అడుగుతుందని ప్రశ్నించారు. అసలు జగన్ కు ఇలాంటి సలహా ఇచ్చిందెవరో ఒకసారి అన్నీ తెలుసుకుని సలహాలివ్వాలని సూచించారు. జగన్ రాసిన లేఖలోని ప్రతి అంశానికి పయ్యావుల సమాధానం ఇచ్చారు. అన్నీ తప్పుడు సమాచారమేనని తేల్చారు. సభ విలువలు, సంప్రదాయాల మీద నడుస్తుందని జగన్ వాటిని ఏ మాత్రం లెక్క చేయడం లేదన్నారు. ఏపీ అసెంబ్లీలో తానే ప్రతిపక్ష నేత అని జగన్ చెబుతున్నారు. అధికార పార్టీ కాకుండా ఎవరికి ఎక్కువ సీట్లు ఉంటే ఆ పార్టీ నేతే ప్రధాన ప్రతిపక్ష నేత అవుతారని పది శాతం సీట్లు ఉండాలనే నిబంధన ఎక్కడా లేదని .. స్పీకర్ కు లేఖ



రాశారు. కేంద్రం ఈ సారి మాత్రమే ప్రధాన ప్రతిపక్ష నేతగా రాహుల్ ఉన్నారు. అంతకు ముందు రెండు సార్లు కూడా ప్రధాన ప్రతిపక్ష నేత లేరు. కాంగ్రెస్ పక్ష నేతకు సంఖ్యాబలం లేకపోవడంతో ఆ హోదా ఇవ్వలేదు. కానీ జగన్ మాత్రం తనకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాల్సిందేనని లేఖలు రాస్తున్నారు.

## దేశం మెచ్చేలా పంచాయితీ వ్యవస్థను

# తీర్చిదిద్దుదాం

### నాశనం అయిన వ్యవస్థలను గాడిలో పెడదాం

### పంచాయితీ ఉద్యోగులతో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



అమరావతి,జూన్26 (ప్రజా మంటలు):

దేశం మెచ్చేలా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ వ్యవస్థకు సొబగులు, విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేలా పని చేస్తానని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అన్నారు. గత ప్రభుత్వంలో నాశనం అయిన వ్యవస్థలను గాడిలో పెట్టేలా కలిసికట్టుగా పని చేద్దామని సూచించారు. అయితే ఉద్యోగులు సహకరిస్తేనే ఇది సాధ్యమని అన్నారు. ఉద్యోగులను చిన్నచూపు చూడనని.. వారిని తన కుటుంబ సభ్యులుగా పరిగణిస్తానని స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బుధవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులతో సమావేశం అయ్యారు. ఉద్యోగుల సమస్యలు ఆసాంతం వింటూ... వాటిని నోట్ చేసుకున్నారు. అనంతరం పవన్ మాట్లాడుతూ.. మస్యలను వినేందుకు, వాటిని సాధ్యమైనంత వేగంగా పరిష్కరిచేందుకు కృషి చేస్తానని అన్నారు. సమస్యలను చెప్పడమే కాదు... ఆమోదయోగ్యమైన పరిష్కార మార్గం సూచించాలని ఉద్యోగులతో అన్నారు. భారత దేశం మెచ్చేలా, జాతి మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు తిరిగి చూసేంత అద్భుతంగా రాష్ట్ర పంచాయతీరాజ్ వ్యవస్థను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పని చేద్దామని పిలుపిచ్చారు. దీనికి తాను కంకణబద్ధుడినై పని చేస్తానన్నారు. తన ఒక్కడి వల్లనే ఈ మహా క్రతువు పూర్తి కాదని, ఉద్యోగుల సహకారం, సూచనలు చాలా అవసరమని.. దీనికి ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషిస్తారని బలంగా విశ్వసిస్తున్నానని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు.

# రాహుల్‌కు నోటీసులు

### - జూలై 2 న హాజరు కావాలంటూ తాఖీదు

### - అమిత్ షాపై అభ్యంతకర వ్యాఖ్యల నేపథ్యంలో జారీ చేసిన ఎంపి - ఎమ్మెల్యే కోర్టు

లక్నో (ప్రజా మంటలు):



కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై అభ్యంతకర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపిస్తూ దాఖలు చేసిన పరువునష్టం కేసులో జులై 2వ తేదీన తమ ఎదుట వ్యక్తిగతంగా హాజరుకావాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఎంపి-ఎమ్మెల్యే కోర్టు బుధవారం ఆదేశించింది. ఈ కేసులో తనను కూడా ప్రతివాదిగా చేర్చుకోవాలంటూ రాంప్రతాప్ అనే వ్యక్తి చేసిన అభ్యర్థనను పిటిషనర్ తరఫు న్యాయవాది సంతోష్ కుమార్ పాండే వ్యతిరేకించారు. రాంప్రతాప్ అనే వ్యక్తి బాధితుడిని కాని ఈ కేసుతో సంబంధం ఉన్న వ్యక్తి కాని కాదని పాండే వాదించారు. అయితే పాండే వాదనను రాహుల్ గాంధీ తరఫు న్యాయవాది కాశీ ప్రసాద్ శుక్లా తోసిపుచ్చారు. అయితే ఇరువురి వాదనలు విన్న న్యాయస్థానం రాం ప్రతాప్ అభ్యర్థనను కొట్టివేస్తూ జులై 2న తుదపరి విచారణ రోజున రాహుల్ గాంధీ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. అమిత్ షాపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ 2018లో రాహుల్ గాంధీపై పరువునష్టం కేసు దాఖలైంది. బిజెపి నాయకుడు విజయ్ మిశ్రా ఈ కేసు దాఖలు చేశారు.

# పిన్నెల్లి బెయిల్ పిటిషన్ తిరస్కరణ

### వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు

### వివిధ కేసుల్లో అరెస్ట్ చేసి తరలింపు

అమరావతి,జూన్26 (ప్రజా మంటలు):

మాచర్ల వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామ కృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. నరసరావుపేటలోని మాజీ మంత్రి అనీల్ కుమార్ యాదవ్ ఇంట్లో ఉన్న పిన్నెల్లిని అదుపులోకి తీసుకుని.. పల్నాడు ఎస్పీ ఆఫీసుకు తరలించారు. ఈవీఎం ధ్వంసంతోపాటు పలు హత్యాయత్నం కేసుల్లో నిందితుడిగా ఉన్న పిన్నెల్లి.. ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టులో నాలుగు పిటీషన్లు దాఖలు చేశారు. ఈ పిటీషన్లపై విచారణ చేసిన హైకోర్టు.. బుధవారం ముందస్తు బెయిల్ పిటీషన్లను కొట్టివేసింది. దీంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేసి ఎస్పీ ఆఫీసుకు తరలించారు. మొన్నటి ఎన్నికల అనంతరం ఏపీలో చెలరేగిన అల్లర్ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ముఖ్యంగా పల్నాడు జిల్లాలో అల్లర్లు రావణకాష్టాన్ని తలపించాయి. మాచర్లలో టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య పోలింగ్ రోజు మొదలైన ఘర్షణలు పోలింగ్ అనంతరం కూడా కొనసాగాయి. ఈ అల్లర్లను సీరియస్ గా తీసుకున్న ఎన్నికల సంఘం ప్రత్యేకబృందాలతో దర్యాప్తు చేయించింది. ఈ ఘర్షణల్లో వైసీపీ నేత, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై పలు కేసులు నమోదవ్వగా కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఇంతకాలం ముందస్తు బెయిల్‌పై ఆయన మరింత కాలం పొడగించాలంటూ దాఖలు చేసిన పిటిషన్లను ఏపీ హైకోర్టు తోసిపుచ్చడంతో పోలీసులు రంగంలోకి దిగారు. అరెస్ట్ చేసిన ఎస్పీ కార్యాలయానికి తరలించారు. అసెంబ్లీ పోలింగ్ మరునటి రోజు చోటు చేసుకున్న హింసాత్మక సంఘటనలకు సంబంధించి మాచెర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిౌపై మొత్తం 14కేసులు నమోదయ్యాయి. ఇందులో మూడు హత్యాయత్నం కేసులున్నాయి. రెంటచింతల మండలం పాల్వాయి గేట్ గ్రామంలో ఈవీఎం ధ్వంసం ఘటన ప్రధానంగా ఉంది. కాగా ఈ కేసుల్లో నిందితుడిగా ఉన్న పిన్నెల్లి సోదరుడు వెంకట రామిరెడ్డి అప్పటి నుంచి పరారీలో ఉన్నారు. అయితే పోలీసులు అతడిని ఎందుకు అరెస్ట్ చేయలేకపోయారని టీడీపీ ప్రశ్నిస్తోంది. పోలీసు శాఖలో కొంతమంది దిగువ స్థాయి అధికారులు ఇస్తున్న లీకులతోనే వెంకట రామిరెడ్డి తప్పించుకు తిరుగుతున్నారని కూటమి పక్షాలు చెబుతున్నాయి. ఈవీఎంలను ధ్వంసం సందర్భంగా టీడీపీ ఏజెంట్‌పై దాడి ఘటనలో పిన్నెల్లిపై హత్యాయత్నం కేసు నమోదయింది. కారంపూడిలో దాడి కేసులో సీఐ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పిన్నెల్లి బ్రదర్స్‌పై మరో హత్యాయత్నం కేసు నమోదయింది. ఇవి కాకుండా ఈవీఎంను ధ్వంసం చేసిన ఘటనలో మరో కేసు నమోదయింది. మొత్తం నాలుగు కేసులు ఆయనపై ఉన్నాయి. హత్యాయత్నం కేసుల్లో ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆయన పిటిషన్లు వేశారు. గతంలో ఎన్నికల కౌంటింగ్ ఉండటంతో ఏపీ హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. అయితే ఈ మధ్యంతర బెయిల్‌పై బాధితులు సుప్రీంకోర్టుకు వెళ్లారు. అప్పట్లో హైకోర్ట్ మధ్యంతర బెయిల్‌పై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. దీంతో పిన్నెల్లి పిటిషన్లపై గతంలోనే వాదనలు విన్న ఏపీ హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది.

# బలరామ్ జాఖడ్ తరవాత బిర్లా

### వరుసగా రెండోసారి స్పీకర్‌గా ఎన్నిక

### స్కూల్ స్థాయినుంచి రాజకీయాలంటే మక్కువ

న్యూఢిల్లీ,జూన్26 (ప్రజా మంటలు):

రాజస్థాన్‌కు చెందిన బలరామ్ జాఖర్ వరుసగా రెండు పర్యాయాలు లోక్‌సభ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయన తొమ్మిదిన్నరేళ్లకు పైగా లోక్‌సభ స్పీకర్‌గా ఉన్నారు. మొదటి పదవీకాలం 22 జనవరి 1980 నుండి 15 జనవరి 1985 వరకు పూర్తి చేశారు. దీని తరువాత, మళ్లీ లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. 16 జనవరి 1985 నుండి 18 డిసెంబర్ 1989 వరకు స్పీకర్‌గా కొనసాగారు. ఆ తర్వాత మధ్యప్రదేశ్‌తోపాటు ఇతర ప్రాంతాలకు గవర్నర్‌గా కూడా పనిచేశారు. ఇక అంతకు ముందు తెలుగు వారైన నీలం సంజీవ్ రెడ్డి, జీఎంసీ బాలయోగి కూడా రెండుసార్లు లోక్‌సభ స్పీకర్‌గా పనిచేసినప్పటికీ, పదవీ కాలానికి మధ్య కొన్ని సంవత్సరాల గ్యాప్ వచ్చింది. అయితే ఓం బిర్లా గత 5 సంవత్సరాలుగా లోక్‌సభ స్పీకర్‌గా ఉన్నారు. తాజాగా మరోసారి లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. దీంతో బలరామ్ జాఖర్ రికార్డును బ్రేక్ చేశారు.ఓం బిర్లా పాఠశాల దశ నుండే రాజకీయాలను ప్రారంభించారు. 1978-79లో మల్టీపర్పస్ స్కూల్ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఉన్నారు. దీని తర్వాత, కామర్స్ కాలేజీలో విద్యార్థి సంఘం ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన బిర్లా, 1987 నుండి 1991 వరకు భారతీయ జనతా యువ మోర్చా కోట అధ్యక్షుడిగా ఉన్నారు. 1987 నుండి 1995 వరకు అతను కోటా కో-ఆపరేటివ్ కన్స్యూమర్ హోల్‌సేల్ భండార్ లిమిటెడ్‌కు ఛైర్మన్‌గా ఉన్నారు. 1993 నుండి 1997 వరకు ఃఏజఓ రాష్ట్ర అధ్యక్షుడిగా, 1997 నుండి 2003 వరకు జాతీయ ఉపాధ్యక్షుడిగా పని చేశారు. ఓం బిర్లా రాజస్థాన్‌లోని కోటా-బండి లోక్‌సభ స్థానం నుంచి ఆయన మూడోసారి లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించారు. బీజేపీపై తిరుగుబాటు చేసి కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే ప్రహ్లాద్ గుంజన్‌పై 41,974 ఓట్ల తేడాతో విజయం సాధించి వరుసగా మూడోసారి పార్లమెంట్‌కు చేరుకున్నారు. ఆర్ఎస్ఎస్ కంచుకోటగా భావించే కోటా ఎన్నికల నియోజకవర్గంలో బీజేపీ మళ్లీ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు పట్టం కట్టింది. కోటాలో వైద్య దావూడియాల్ జోషి తర్వాత మూడుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లోనూ, మూడుసార్లు లోక్‌సభ ఎన్నికల్లోనూ గెలిచిన తొలి నాయకుడు కావడం విశేషం. 2003 నుంచి ఓం బిర్లా ఏ ఎన్నికల్లోనూ ఓడిపోలేదు. 2003లో తొలిసారిగా కోటాలో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. 2008లో కోటా సౌత్ స్థానం నుంచి కాంగ్రెస్ నేత శాంతి ధరివాల్‌పై విజయం సాధించారు. 2013లో కోటా సౌత్ స్థానం నుంచి మూడోసారి గెలుపొందారు. 2014లో తొలిసారిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అంటే 2019, 2024లో విజయమే రుచి చూశారు. 2019లో బీజేపీ ఆయనను స్పీకర్‌గా చేయడంతో అందరూ ఆశ్చర్యపోయారు. సుదీర్ఘ పార్లమెంటరీ అనుభవం లేకపోయినా ఓం బిర్లా సభను నడిపిన తీరు ప్రశంసనీయం. ఈ క్రమంలోనే ఓం బిర్లా లోక్‌సభ స్పీకర్‌గా రెండవసారి ఎన్నికయ్యారు. ఓం బిర్లా కొత్త, పాత పార్లమెంటు భవనాల్లో పనిచేసిన రికార్డు ఉన్న మొదటి ఓం బిర్లా 1962 నవంబర్ 23న రాజస్థాన్‌లోని కోటాలో జన్మించారు. అతని తండ్రి పేరు శ్రీకృష్ణ బిర్లా, తల్లి పేరు శకుంతలా దేవి. మార్చి 11,



1991న అతను డాక్టర్ అమితా బిర్లాను వివాహం చేసుకున్నారు. వీరికి ఆకాంక్ష, అంజలి బిర్లా అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓం బిర్లా విద్యాభ్యాసం విషయానికి వస్తే, అతను 1986లో మహర్షి దయానంద్ సరస్వతి విశ్వవిద్యాలయం నుండి డిగ్రీ పూర్తి చేశారు. బిర్లా మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తి. అతని తండ్రి శ్రీ కృష్ణ బిర్లా రాష్ట్ర పన్ను శాఖలో ప్రభుత్వ ఉద్యోగి. తల్లి శకుంతలా దేవి గృహిణి. బిర్లాకు 6 మంది సోదరులు, ముగ్గురు సోదరీమణులు ఉన్నారు. అతని ఇద్దరు అన్నలు రాజేష్ కృష్ణ బిర్లా, హరికృష్ణ బిర్లా సహకార బోర్డు ఛైర్మన్‌గా పని చేశారు. బిర్లా భార్య అమిత బిర్లా వృత్తిరీత్యా ప్రభుత్వ వైద్యురాలు. అతని పెద్ద కుమార్తె ఆకాంక్ష వివాహం చేసుకుంది. చార్టర్డ్ అకౌంటెంట్‌గా కొనసాగుతున్నారు. చిన్న కూతురు అంజలి అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌లో ఉన్నారు.

## రోడ్లు సరిగా లేనప్పుడు

# టోల్‌టాక్స్ ఎలా వసూలు చేస్తారు!

సూచించారు. గుం తలతో కూడిన రోడ్లు, టోల్ వద్ద రద్దీ.. ఏమాత్రం ఆమో దయోగ్యం కాదన్నారు. శాటిలైట్ ఆధారిత టోల్ వసూలుపై నిర్వహించిన గ్లోబల్ వర్క్‌షాప్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మీరు మంచి సేవలు అందించలేనప్పుడు టోల్ ఛార్జీ వసూలు చేయొద్దు. రోడ్లు బాగా లేకపోతే ప్రజలు హర్షించరు. చాలామంది ఇప్పటికే సోషల్‌మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. కాబట్టి మంచి రోడ్లు అందివ్వలేనప్పుడు టోల్ వసూలు చేయకూడదు. ఒకవేళ గుంతలతో కూడిన రోడ్లపై టోల్ వసూలు చేస్తే రాజకీయ నాయకులుగా మేం ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది‘ అని గడ్కరీ అన్నారు. టోల్ ప్లాజాల వద్ద ఆలస్యం కాకుండా చూడాలని నేషనల్ హైవే ఫీల్డ్ ఆఫీసర్లకు సూచించారు. శాటిలైట్ ఆధారిత టోల్ ఛార్జీల వసూలు విధానాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలోనే ప్రారంభించనున్నట్లు గడ్కరీ తెలిపారు. తొలి దశలో 5 వేల కిలోమీటర్ల రహదారులపై ఈ టోల్ విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. తొలుత కమర్షియల్ వాహనాలకు ఒక లేన్‌లో అనుమతిస్తారు. టోల్ వసూలుకు కీలకమైన వెహికల్ ట్రాకర్ సిస్టమ్ యూనిట్‌ను ఆయా వాహనాల్లో అమర్చాల్సి ఉంటుంది. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే వాహనాలు టోల్ ఎ÷-లాజాల వద్ద ఆగాల్సిన అవసరం ఉండదు. దశలవారీగా ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నారు. ఈ విధానం వల్ల ప్రభుత్వానికి రూ.10వేల కోట్లు అదనపు ఆదాయం సమకూరనుందని గడ్కరీ తెలిపారు.

# స్పీకర్‌పై సమవర్తిలా ప్రవర్తించాలి !

లోక్‌సభ అంటే దేశ ప్రజలందరిని ప్రతిబించే సభ. ఇది ఏ ఒక్కరిదో కాదు. అధికార పక్షమైనా, విపక్షమైనా అంతా ప్రజల ప్రతినిధులుగా ఎన్నుకోబడి వచ్చినవారే. విపక్షంలో ఉన్న వారైనా తమ నియోజకవర్గ ప్రజలకు ప్రాతినిధ్యం వహించేవారుగా గుర్తించాలి. విపక్షం అంటే గంజిలో ఈగలాగా తీసేసే సంస్కృతి పోవాలి. విపక్షానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి, వారు లేవనెత్తే సమస్యలపై చర్చ చేయాలి. ఇలా ఏ ఒక్క సభ్యుడినైనా తిరస్కారానికి గురి చేయకుండా గౌరవించడం ద్వారా పార్లమెంట్ ఔన్నత్యాన్ని పెంపొందిం చాలి. పార్లమెంట్ అంటే ప్రజల సమస్యలపై చర్చకు వేదిక కావాలి. పరిష్కారానికి దారి చూపాలి. సత్వర నిర్ణయాలు తీసుకోవాలి. తద్వారా ప్రజలకు బాసటగా నిలవాలి. అప్పుడే పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై ప్రజలకు నమ్మిక కుదురుతుంది. ఈ క్రమంలో స్పీకర్ పదవి అన్నది చాల ఉదాత్తమైన పాత్ర పోషించేది. దేశప్రజల సమస్యలను ప్రస్తావించేలా, దానిపై సమగ్రంగా చర్చ జరిగేలా, అలాగే సంప్రదాయాలను పాటించేలా చూడాలి. ఇప్పుడు విపక్ష సభ్యుల సంఖ్య పెరిగినందున గతంలో లాగా బుల్‌డోజ్ వ్యవహారం కుదరదు. అధికార పక్షానికి కొంత తక్కువగా వారికి చేరువలోనే విపక్షం కూడా బలంగానే ఉంది. అందువల్ల సమస్యలను లేవనెత్తినప్పుడు, వాటిపై చర్చ జరిగేలా చూసి, ప్రభుత్వం సంతృప్తికర సమాధానం ఇచ్చేలా చేయడంలో స్పీకర్ కీలక భూమిక పోషించాల్సి ఉంటుంది. ఇది ఇరుపార్టీల మధ్య పోటీ కాదు కనుక చర్చలు చేయడంలో స్పీకర్ ఎక్కువ శ్రద్ద తీసుకోవాలి. దేశ ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు విపక్షం ఎప్పుడు సిద్దంగా ఉంటుంది. అవసరమైతే నిలదీస్తుంది. ఈ క్రమంలో స్పీకర్ ధర్మపక్షపాతిగా నిలవాలి. గురుతర బాధ్యతను నిర్వర్తించాలి. దేశంలో లోక్‌సభ స్పీకర్ అనేది ఒక కీలక పదవి. దీని కోసం ప్రతి ఐదేళ్లకోసారి అధికారం, ప్రతిపక్ష నేతల మధ్య పోటీ జరుగుతూనే ఉంటుంది. ఈ క్రమంలోనే స్పీకర్ పదవి కోసం జరిగిన ఎన్నికలో తిరిగి ఓం బిర్లా ఎన్నికయ్యారు. అధికార పక్షానికి చెందిన ఓం బిర్లా కోట నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ప్రతిసారీ ఏకగ్రీవంగా ఎంపిక చేయాలనే లక్ష్యంతో సాగిన పార్లమెంట్ ఇప్పుడు మాత్రం పోటీ ద్వారా స్పీకర్‌ను ఎన్నుకుంది. డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేయగా, బీజేపీ స్పందించలేదు. దీంతో ఆగ్రహించిన ప్రతిపక్షాలు స్పీకర్ పదవి కోసం తమ అభ్యర్థిని నిలబెడుతున్నట్లు ప్రకటించాయి. ఈ క్రమంలో ప్రొటెం స్పీకర్ సభలో ఓటింగ్ నిర్వహించారు. ఎన్డీయేమరోసారి ఓం బిర్లాను అభ్యర్థిగా నిలబెట్టగా, విపక్షాలు కే సురేష్‌ను బరిలోకి దింపాయి. దేశచరిత్రలో స్పీకర్ ఎన్నిక జరగడం ఇది మూడోసారి. లోక్‌సభలోని 542 సీట్లలో, ఎన్‌డిఎకు 293 సీట్లు ఉన్నాయి. విపక్షాలకు సంఖ్యా బలం లేదు. కాబట్టి డిప్యూటీ స్పీకర్ పదవి కూడా ఎన్డీయేకే దక్కే ఛాన్స్ ఉంది. ఈ క్రమంలో ఓం బిర్లా స్పీకర్‌గా మూజువాణి ఓటుతో నెగ్గారు. బిర్లా రెండోసారి స్పీకర్‌గా ఎన్నికైన తొలి బీజేపీ నేతగా చరిత్రకెక్కారు. ఇంతకు ముందు కాంగ్రెస్‌కు చెందిన బలరాం జాఖర్ రెండుసార్లు స్పీకర్‌గా ఉన్నారు. లోక్‌సభలో మొత్తం ఎంపీల సంఖ్య 543. బీజేపీకి 240 మంది ఎంపీలు ఉన్నారు. కాగా ఎన్డీయేకు మొత్తం 293 మంది ఎంపీలు కలరు. టీడీపీ నుంచి 16 మంది, జేడీయూ నుంచి 12 మంది ఎంపీలు ఉన్నారు. ఇండియా కూటమికి 235 మంది ఎంపీలు ఉండగా, వారిలో కాంగ్రెస్‌కు 98 మంది, ఇతరులకు 14 మంది ఉన్నారు. లోక్‌సభలో టీఎంసీకి 29 మంది ఎంపీలు ఉన్నారు. వీరంతా ఆయా ప్రాంతాల ప్రజలకు ప్రతినిధులుగా లోక్‌సభలో అడుగు పెట్టారు. ఈ క్రమంలో అనేక సమస్యలు ఇప్పుడు దేశం ముందున్నాయి. సాధారణంగా విపక్షమే ఈ సమస్యలను ప్రస్తావిస్తుంది.

దేశం స్వాతంత్ర్యం సాధించుకుని గర్వంగా 75 ఏళ్లు పూర్తి చేసుకున్న తరుణంలో, కష్టాలు,నష్టాలు భరించి, ఆకలి బాధలను మరచి ప్రజలు దేశం పట్ల తమకున్న భక్తిని చాటు తున్నారు. ఇదే సమయంలో పాలకులు తమ విధానాల్లో, ఆలోచనల్లో మార్పులతో ముందుకు సాగాలి. పటిష్ట భారత నిర్మాణానికి కంకణబద్దులు కావాలి. రాజకీయాలను పక్కన పెట్టి సానుకూలంగా ఆలోచన చేసి ముందుకు సాగాల్సిన సమయమిది. అన్నిరంగాల్లో మనం ముందంజ వేయాల్సిన దశలో ఇంకా దిగుబడులపై ఆధారపడుతూ ఎగుమతుల విషయంలో లక్ష్యం లేకుండా సాగుతున్నాం. రాజకీయ దృక్కోణంలో కాకుండా అభివృద్ధి కోణంలో పాలన చేయాల్సిన విషయాన్ని పాలకులు వంటబట్టించు కోవాల్సి ఉంది. ఐదేళ్లు అధికారంలోకి రాగానే మరో ఐదేళ్లు గద్దెపై ఉండడ మెలా అన్న ఆలోచన చేయడం వల్లనే భారత్ 75 ఏళ్ల తరవాత కూడా ఇంకా దారిద్య్రం, నిరక్షరాస్యత, వసతుల కొరత, ఆహారధాన్యాల కొరతతో అలమటిస్తోంది. ఇదంతా పాలకుల దృష్టి లోపంగా చూడాలి. విద్యా,వైద్యరంగం ఎందుకు వెనకబడి ఉందో తెలుసుకోవాలి. పేపర్ లీకేజీల్లాంటివి జరగడం విద్యార్థుల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఇలాంటి వాటిపై చర్చించి, అక్రమాలను అరికట్టేందుకు పూనుకోవాలి. ఆహార ధాన్యాలను ఇంకా ఎందుకు దిగుమతి చేసుకుంటు న్నామో ఆలోచన చేయాలి. వివిధ రంగాలపై అది చూపిస్తున్న చెడు ప్రభావాన్ని విశ్లేషించు కోవాల్సిన కేంద్రం ప్రభుత్వం ప్రజల కోణంలో ఆలోచించాలి. ఆహారధాన్యాల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఉల్లిపాయలు,కూరగాయల ధరలు దిగిరావడం లేదు. నిత్యవసరాలు అందనంతగా దూసుకు పోతున్నాయి. వంటనూనెలు భగ్గుమంటున్నాయి. మనం చేపట్టిన సంస్కరణలు ఫలితాలు ఇవ్వడం లేదన్న విషయాన్ని పాలకులు గుర్తించడం లేదు. నిజానికి దేశంలో నల్లధనం, అవినీతి పోవాలంటే రాజకీయ పార్టీల నుంచే ప్రక్షాళన మొదలవ్వాలి. నల్లధనం రూపంలో రాజకీయ పార్టీలు విరాళాలు తీసుకుని ఓటర్లను కొనుగోలు చేయడానికి వాడుతున్నాయి. ఎన్నికలు అయ్యాక తగిన మెజారిటీ సమకూరని సందర్భాలలో ఎమ్మెల్యేలు లేదా ఎంపీల బేరసారాల కోసం ఈ నల్లధనాన్నే వాడుతున్నారు. వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు రాజకీయ పార్టీలకు ఇస్తున్న విరాళాలలో అత్యధిక భాగం నల్లడబ్బు రూపంలోనే ఉంటోంది. ఈ పరిస్థితిని నివారించకుండా ఎన్ని సంస్కరణలు చేసినా ఫలితం ఉండదు. ఎన్నికల్లో ఆయా పార్టీలు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న వైనం తాజా ఎన్నికల్లో సైతం చూసాం. ఈ డబ్బుకు లెక్క ఉందో లేదో చెప్పాలి. ఇలా రాజకీయ పార్టీలకు అధికార యావే తప్ప ప్రజలు,దేశ సంక్షేమం కనబడడం లేదు. ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గవర్నర్ వ్యవస్థ ఇలా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం బదులు నానాటికి దిగజారుస్తున్నాయి. ప్రజల డబ్బు నీళ్ల ప్రాయంగా ఖర్చవుతోంది. ముక్కుపిండి వసూలు చేస్తున్న పన్నులను పాలకుల విలాసాలకు ఖర్చు చేసుకుంటున్నారు. వ్యవసాయరంగం కుంగి కృషించి పోతోంది. రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఆహార ధాన్యాలకు మద్దతు ధరలు అందడం లేదు. విద్య మిధ్యగా మారింది. ఉద్యోగాల కల్పన అంతంత మాత్రంగానే ఉంది. రాజకీయాల్లో ఎదుటి పక్షాలను ఢీకొట్టేందుకు తమ తెలివిని ఉపయోగిస్తున్న పాలకులు ప్రజల సమస్యలు పరిష్కరిం చడంలో తగిన శ్రద్ద చూపడం లేదు. ఈదశలో ఇలాంటి ప్రజాస్వామ్యం కొనసాగితే మరో వందేళ్లయినా మన భారత్ రాత మారదు. ప్రజాధనం వృధా ఖర్చులకు కళ్లెం పడాలి. ఇవన్నీ కూడా పార్లమెంట్ వేదికగా చర్చ జరగాలి. విపక్షాలు అమీతుమీ అన్న తీరును పక్కన పెట్టి సమస్యలపై సావధానంగా చర్చించేలా చూసుకోవాలి. విపక్షానికే ఎక్కువ బాధ్యత ఉంటుందని గుర్తించి మసలుకోవాలి. స్పీకర్‌గా ఎన్నికైన ఓంబిర్లా ఇలాంటి సమస్యలపై చర్చకు ఆస్కారం కల్పించాలి. అప్పుడే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం బలోపేతం కాగలదు.

## కవిత్వం

### పాలీట్రిక్స్

ఇక ఫిరాయింపులకు
తెర్చుకున్న తలుపులు,
ఇరుపార్టీల ఆకర్షకు
ఆలోచనలో యోధులు!
ఒక రంగుతో గెలుపు
మరో రంగులోకి జంపు,
గోడమీద పిల్లులకు
అలవాటే రంగుల కంపు!

..న్యాలకంటి నారాయణ
9346200066

## తాతయ్య మంచి మాటలు




"పిల్లలు సమయం ఎనిమిది గంటలవుతుంది. ఇంకా మీరు నిద్ర లేవకుంటే ఎలా ? ఇంత సోమరులుగా పడుకుంటే ఆరోగ్యానికి హానికరం. తొందరగా లేవండి అంటూ బామ్మ కేకలు పెట్టింది" .ఇవేమీ తమకు పట్టనట్టు కావ్య ,నవ్య అలానే పడుకున్నారు. మరోవైపు బామ్మ మాటలు మీకు వినిపించట్లేదా? అంటూ అమ్మ మాటలు చెవిలో మారు.
మోగుతుంటే ఇక తప్పదు అన్నట్టు నిద్ర నుండి మేల్కొని వచ్చారు. వస్తూనే టీవీ ఒకరు, ఇంకొకరు సెల్ఫోన్ చూస్తున్నారు. వీరిని గమనిస్తున్న తాతయ్య ముసి ముసి నవ్వులు నవ్వుతూ పిల్లలూ మీరు తొందరగా రండి మీతో కాస్త మాట్లాడాలి అనగానే అలాగే తాతయ్య అంటూ భారంగా పది నిమిషాల్లో రెడీ అయ్యి వచ్చారు.

"తాతయ్య ఇప్పుడు చెప్పండి మాతో ఏదో మాట్లాడాలి అన్నారు కదా". ఎందుకు తొందర, మీరు ముందుగా టిఫిన్ తినండి .సాయంకాలం పార్కుకి వెళ్దాం అక్కడ తీరిగ్గా మాట్లాడుకుందాం అని తాతయ్య చెప్పగానే రెండు నిమిషాల్లో గబగబా టిఫిన్ ముగించారు. సాయంకాలం తాతయ్యతో కలిసి సరదాగా ఇంటికి దగ్గర్లో ఉన్న పార్కు వెళ్లారు. అక్కడ చాలాసేపు హాయిగా ఎగిరి గంతులు వేస్తూ ఆడుకున్నారు. వారిని గమనిస్తున్న తాతయ్య ఇటు రమ్మని సైగ చేశాడు.

తాతయ్య పిల్లలతో "పిల్లలు మీరు ప్రతిరోజు ఆలస్యంగా నిద్రలేస్తున్నారు నిజమేనా? అవును తాతయ్య. ఒరేయ్ ఆలస్యంగా నిద్ర లేవడం ద్వారా సోమరులుగా తయారయ్యే అవకాశం ఉంది .సూర్యోదయానికి ముందే లేచి జాగింగ్, వ్యాయామం లాంటివి ఆరోగ్యానికి చాలా మంచిది. మరి మీరు అందుకు విరుద్ధంగా చేస్తున్నారు ఆలస్యంగా నిద్రలేస్తున్నారు. ఇలానే చేస్తే మరి బద్ధకస్తులయ్యే ప్రమాదం ఉందన్నాడు.

సెలవుల్లో హాయిగా ఇంట్లో అమ్మకు వంటింట్లో సహాయం చేస్తూ ఉండడం ద్వారా భవిష్యత్తులో మీకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కూరగాయలు తరగడం, మీ బట్టలు మీరే ఉతకడం లాంటి చిన్న చిన్న పనులు తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలి. ఇలా చేయడం ద్వారా భవిష్యత్తులో పెద్ద చదువులు చదవడానికి వెళ్ళినప్పుడు అక్కడ మీ పనులు మీరే స్వయంగా చేసుకోవాలి .అది ఇప్పటినుండి మీరు నేర్చుకోవడం మంచిది అని చెప్పగానే సరే తాతయ్య "మీరు చెప్పినట్టు అన్ని పనులు రేపటి నుండి మేమే చేస్తాం మీరు చూస్తూ ఉండండనగానే తాతయ్య సంతోషించాడు.



మరుసటి రోజు నుండి అందరి కంటే ముందుగానే కావ్య , నవ్య ఇంట్లో పనులన్నీ పూర్తి చేశారు . పిల్లలు త్వరగా లేచి అన్ని పనులు చేయడం ఇంట్లో వారందరినీ ఆశ్చర్యపరిచింది. అంతే కకుండా బామ్మ సహకారంతో రకరకాలైన వంటలు నేర్చుకున్నాను .తన మాట మీద గౌరవంతో పిల్లలు మారినందుకు తాతయ్య వారిని అభినందించారు.

నీతి: చదువుతోపాటు ఇంట్లో పనులు కూడా నేర్చుకోవాలి.

**యాడవరం చంద్రకాంత్ గౌడ్**
**సిద్దిపేట, 9441762105**

# అసమాన యోధుడు జనరల్ మానెక్‌షాజి

### జూన్ 27...భారతీయ సైన్య మొదటి ఫీల్డ్ మార్షల్ మానెక్‌షా వర్ధంతి..



**రామ కిష్టయ్య సంగన భట్ల**
**9440595494**



ఆయన యుద్ధ వీరుడు. సాహస సైనికుడు. సమర్థ నాయకుడు. అయిదు యుద్ధాలలో పాల్గొని, తుపాకీ గుళ్ళు శరీరంలో దిగినా, విశ్రమించని పోరాట యోధుడు. పాకిస్తాన్ యుద్ధ విజయ సారథి. ఆయనే ధైర్య సాహసాలకు మారు పేరుగా నిలిచిన భారత సైనికుడు, జాతీయ హీరో ఫీల్డ్ మార్షల్ మానెక్‌షా. అయన పూర్తి పేరు శాం హొర్ముస్‌జీ ఫ్రేంజీ జెమ్‌షెడ్జీ మానెక్ షా (ఏప్రిల్ 3, 1914 %-% జూన్ 27, 2008). 1971లో పాకిస్తాన్తో యుద్ధంలో భారత్‌కు అతిపెద్ద సైనిక విజయాన్ని సాధించి పెట్టిన ఆయన బంగ్లాదేశ్ ఆవిర్భావానికి అద్యుడయ్యారు.

1914 ఏప్రిల్ 3వ తేదీన అమృతసర్ లోని పార్శీ దంపతులకు మానెక్‌షా జన్మించారు. ఆయన తల్లిదండ్రులు గుజరాత్ రాష్ట్రంలోని వల్సాద్ అనే చిన్న పట్టణం నుంచి అమృతసర్, పంజాబ్ రాష్ట్రంకు వలస వెళ్ళారు.

అమృతసర్, నైనిటాల్‌లలో పాఠశాల విద్య పూర్తయ్యాక డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీలో క్యాడెట్‌గా తొలి బ్యాచ్‌లో మానెక్ షా చేరారు. 1934లో ఆయన సైన్యంలో రెండో లెఫ్టినెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. జూన్ 7, 1969 న జనరల్ కుమార మంగళం నుండి 8వ సైనిక దళాల ప్రదానాధికారిగా బాధ్యతలు స్వీకరించి 15, జనవరి 1973 న పదవీ విరమణ చేసారు.

బ్రిటిష్ పాలనా కాలం మొదలుకొని నాలుగు దశాబ్దాల పాటు సైన్యంలో సేవలు అందజేసిన శాం మానెక్‌షా- రెండవ ప్రపంచ యుద్ధంలోను, భారత స్వాతంత్ర్యానంతరం చైనా, పాకిస్థాన్‌లతో జరిగిన మూడు యుద్ధాల సందర్భంగాను ప్రదర్శించిన వ్యూహ చతురత, బుద్ధి కుశలత అమోఘమైనవి. రెండో ప్రపంచ యుద్ధం జరుగు తున్నప్పుడు జపాన్ ఆక్రమిత దళాలను తిప్పి కొట్టేందుకు ఉద్దేశించిన సైనిక విభాగం అధిపతిగా బర్మాలో ఆయన ప్రాణాలొడ్డి పోరాడారు. కడుపులోకి ఏడు గుళ్లు దూసుకుపోయి తీవ్రంగా గాయపడ్డారు. అపూర్వ ధైర్యసాహసాలు ప్రదర్శించిన సైనికులకు ఇచ్చే అత్యున్నత పతకం 'మిలిటరీ క్రాస్'ను మృతులకు ప్రకటించ రాదన్నది నియమం. మానెక్‌షా బతికి బట్టకట్టక పోవచ్చునని భావించిన నాటి మేజర్ జనరల్ డి.టి.కోవన్, తన 'మిలిటరీ క్రాస్ రిబ్బన్'ను తక్షణం మానెక్‌షాకు ప్రదానం చేశారు. అదృష్టవశాత్తు మృత్యుముఖం లోంచి బయట పడిన మానెక్‌షా, మరోసారి బర్మాలో జపాన్ సైనికులను ఢీకొన్నారు. మళ్ళీ గాయ పడినప్పటికీ వెన్ను చూపలేదు. జపాన్ సైనికులు లొంగిపోయాక, 10 వేల మందికిపైగా యుద్ధ ఖైదీలకు పునరావాసం కల్పించడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. 1947లో దేశవిభజన, 1947-48లో జమ్ము కాశ్మీర్‌లో సైనిక చర్యల సందర్భంగా ఆయన తన పోరాటపటిమను మరోమారు లోకానికి చాటి చెప్పారు. 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధం ఆయన వ్యూహ నైపుణ్యానికి, దీక్షాదక్షతలకు అద్దం పట్టింది. ఆ యుద్ధంలో పాక్ చిత్తుగా ఓడిపోవడమే కాదు, 45,000 మంది పాక్ సైనికులు, మరో 45,000 మంది పౌరులు యుద్ధ ఖైదీలుగా పట్టుబడ్డారు. తరువాత బంగ్లా ఆవిర్భావానికి దోహద పడిన సిమ్లా అంగీకారం కుదర్చడంలోనూ ఆయనది కీలక భూమికే. ఆయన సమర్థ సారథ్యం దేశసైనిక దళాల్లో సరికొత్త విశ్వాసాన్ని, ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపింది. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం 1973 జనవరిలో మొట్టమొదటి ఫీల్డ్‌మార్షల్‌గా పదోన్నతి కల్పించి, ఆయనను సముచిత రీతిలో గౌరవించింది.

1971 ఆరంభంలో తూర్పు పాకిస్థాన్ నుంచి పెద్దయెత్తున శరణార్థులు భారత్‌లోకి వస్తున్న సమస్యపై ఆ ఏడాది ఏప్రిల్ 27న జరిగిన క్యాబినెట్ సమావేశానికి త్రివిధ దళాధిపతుల కమిటీ అధ్యక్షుడిగా ఉన్న మానెక్‌షానూ ఆహ్వానించారు. ఈ సమస్యని పరిష్కరించడానికి తక్షణం సైనికులని పంపాలన్న ప్రధానమంత్రి ఇందిరాగాంధీ నిర్ణయాన్ని వాతావరణం అనుకూలంగా లేదన్న కారణముతో ఒప్పుకోకుండా, వెంటనే యుద్ధానికి దిగక తప్పదంటే మానసిక లేదా శారీరక అనారోగ్య కారణాలపై రాజీనామా చేయడానికి తాను సిద్ధమే అనడం ద్వారా తన నాయకత్వ లక్షణాలని చాటిన ఈయన, తన సమర్థ వాదనతో క్యాబినెట్‌ను ఒప్పించి 1971 డిసెంబరులో, అన్ని విధాలా సానుకూల పరిస్థితుల్ని చూసుకొని పాక్‌పై పూర్తిస్థాయి యుద్ధాన్ని ప్రారంభించి, అద్భుత విజయం సాధించి చూపి తన నిర్ణయం ఎంత సరియినదో నిరూపించి వ్యూహ కర్తగా ఆయన చతురతను చాటిచెప్పిన వైనం అద్వితీయం.

మీ యుద్ధ విమానాలు నాశనం చేశాం, మిమ్మల్నందరిని మా సైనికులు చుట్టూ ముట్టి వున్నారు. లొంగిపోక పోతే నిర్దాక్ష్యంగా చంపేస్తాం అంటూ పాకిస్తాను సైనికులని కఠినంగా హెచ్చరించి శత్రువులని లొంగదీసుకున్న గొప్ప తనం ఆయనకే సొంతం.

శాం మానెక్‌షా గొప్ప వక్త కూడా. ముక్కు సూటిగా నిర్మొహమాటంగా మాట్లాడే వ్యక్తి. భారత సమాజాన్ని నాయకత్వ కొరతే పట్టి పీడిస్తోందంటూ ఒక సందర్భంలో ధైర్యంగా దాపరికం లేకుండా చెప్పారు. అన్ని రంగాల్లో నాయకత్వ కొరతే దేశంలోని అస్తవ్యస్త పరిస్థితులకు కారణమని స్పష్టం చేశారు. వృత్తిపరమైన సామర్థ్యం, విజ్ఞానం, నిజాయతీ, నిష్పాక్షికత, ధైర్యం, విశ్వసనీయత, ప్రజా సమస్యల పరిష్కారం పట్ల నిబద్ధత - ఇవీ నాయకుడికి ఉండాల్సిన లక్షణాలని వివరించి, లక్షలమంది సైనికులకు, సైనికులుగా చేరాలనుకున్న వారికే కాకుండా సామాన్యులకి కూడా స్ఫూర్తిగా నిలిచారు.

భారత్‌కు ఎన్నో విజయాలను అందించిన యుద్ధ సేనాని మానెక్ షా జూన్ 26, 2008 గురువారం అర్ధరాత్రి 94ఏళ్ల వయస్సులో మృతి చెందారు.

## రోజురోజుకు దిగజారి పోతున్న రాజకీయాలు జమ్మికుంట జడ్పిటిసి డాక్టర్ శ్రీరామ్ శ్యామ్



జమ్మికుంట జూన్ 26 (ప్రజామంటలు):

జమ్మికుంట జడ్పిటిసి కార్యాలయంలో పత్రిక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జమ్మికుంట జెడ్పిటిసి డాక్టర్ . శ్రీరామ్ శ్యామ్ మాట్లాడుతూ. హుజురాబాద్ నియోజకవర్గంలో రాజకీయాలు రోజురోజుకు దిగజారిపోతున్నాయని వారు ఎద్దేవా చేశారు. గత కొన్ని రోజుల నుండి హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అధికార పార్టీ చెందిన కొందరు నాయకులు విమర్శ ప్రతి విమర్శలు చేసుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని వారు గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకులు, దేవుని మీద ఒట్లు, ఒకరి మీద ఒకరు తిట్లు, ప్రజా సమస్యలతో పాట్లుగా కొన్ని రోజులుగా హుజురాబాద్ రాజకీయాలు నడుస్తున్నాయని, ఎద్దేవ చేశారు. బూడిద పంచాయతీ ముందు వేసుకుని ప్రజా అవసరాలను పట్టించుకోకుండా సవాళ్లు విసురుకొని హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలను,ఆయా పార్టీ కార్యకర్తలను అయోమయానికి గుర్తు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారని వారి సందర్భంగా గుర్తు చేశారు. హుజురాబాద్ నియోజకవర్గం లో దాదాపు ఆరువందలకు పైగా కళ్యాణ లక్ష్మి చెక్కులు వచ్చినప్పటికీ కూడా అధికారులు పట్టించుకోకుండా అధికార పార్టీ చెందిన నాయకులు, ఎమ్మెల్యే పట్టించుకోకుండా వారి యొక్క సొంత ప్రయోజనాల కోసం పాటుపడుతున్నారు తప్ప కళ్యాణ్ లక్ష్మి చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ చేయాలని కనీసం సోయ లేకుండా ప్రవర్తిస్తున్నారని జెడ్పిటిసి శ్రీరామ్ శ్యామ్ అన్నారు. హుజురాబాద్ మాజీ ఎమ్మెల్యే మాజీ మంత్రి ఈటల రాజేందర్ మంత్రిగా ఉన్న సమయంలో ఎమ్మార్వోలు స్థానిక జడ్పిటిసి,ఎంపీపీ, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ,ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసేవారని వారు గతాన్ని గుర్తు చేసుకున్నారు. ఈనాటి ప్రజా ప్రతినిధులు ప్రోటోకాల్ సాకుతో ప్రజా సమస్యల పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికార పార్టీ చెందిన నాయకులు, హుజరాబాద్ ఎమ్మెల్యే వ్యక్తిగత సమస్యలు మానుకొని ప్రజా సమస్యల కోసం ముందుకు రావాలని శ్రీరామ్ శ్యామ్ డిమాండ్ చేశారు. హుజరాబాద్ నియోజకవర్గంలో ఉన్న కళ్యాణ లక్ష్మి చెక్కులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను వెంటనే పంపిణీ చేయాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అధికార పార్టీకి చెందిన నాయకులు హుజరాబాద్ ఎమ్మెల్యే సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలు తీర్చాలని వారు కోరారు. ప్రజా సమస్యలను పట్టించుకోలేకపోతే, ప్రజలే వారికి తగిన బుద్ధి చెప్తారని వారు గుర్తు చేశారు.

## జిల్లా వ్యాప్తంగా విజయవంతమైన 'పాఠశాలల బంద్' మల్యాల రాకేష్ ఏబివిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

జగిత్యాల జూన్ 26 (ప్రజామంటలు):



ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించాలని,అలాగే విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలలను బంద్ పిలుపు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏబివిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్ మాట్లాడుతూ.... ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతులు లేని కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి సకాలంలో పాఠ్యపుస్తకాలు పంపిణీ జరగక విద్యార్థులు విద్యకు దూరం కావాల్సి వస్తుంది అని తెలిపారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో లక్షలకు లక్షలు ఫీజులు దండుకుంటున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటు పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా మారుస్తూ (పుస్తకాలు, యూనిఫామ్, టై, బెల్ట్) వంటివి అమ్ముకుంటూ విచ్చలవిడిగా రాజ్యం ఏలుతున్నారని పలుమార్లు పుస్తకాలు అమ్ముతున్నారని ఆధారాలతో ప్రత్యక్షంగా అధికారులకు పట్టించిన నామమాత్రపు చర్యలు తీసుకుని ప్రవేట్ యాజమాన్యాలు ఇచ్చే సొమ్ముకు అమ్ముడుపోతున్నారు. ఇకనైనా జిల్లా విద్యాధికారి మొద్దు నిద్ర వీడి విద్యార్థులకు న్యాయం చేయాలని వార్తలు. అలాగే అనుమతి లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలల పైన చర్యలు తీసుకొని నియమ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలకు గుర్తింపును రద్దు చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుందన్నారు. అదేవిధంగా మెగా డి ఎస్సి ద్వారా అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది సత్వరమే భర్తీ చేయాలని అలాగే ప్రైవేట్ పాఠశాలలో 25% పేద మధ్య తరగతి విద్యార్థులకు కేటాయించాలి. ఫీజులు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి:**

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి, ఉపాధ్యాయ కొరత లేకుండా అధ్యాపక అధ్యపై కేతర సిబ్బందిని నియమించాలి. ఖాళీగా ఉన్నటువంటి (డిఈఓ, ఎంఈఓ) పోస్టులను భర్తీ చేయాలి. విద్య హక్కు చట్ట ప్రకారం ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం పేద విద్యార్థులకు కేటాయించాలి. ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలలను తొలగించి కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబెర్ రాపాక సాయి, నగర కార్యదర్శి రాజు ప్రశాంత్, కళ్యాణ్, విగ్నేష్, విష్ణు, రాకేష్, విశాల్, బన్నీ, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం

గొల్లపల్లి జూన్ 26 (ప్రజామంటలు):

గొల్లపల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్ ఆదేశాల మేరకు ప్రపంచ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం గొల్లపెల్లి పోలీస్ శాఖ వారు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై సిహెచ్ సతీష్ మాట్లాడుతూ, గొల్లపెల్లి మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో యువకులు బహిరంగ ప్రదేశాల్లో అను మానస్పదంగా కనిపించినచో డైల్ 100 కు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలను యువతకు వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు దృష్టిపెట్టి, సరైన మార్గదర్శన చేయాలని సూచించారు.

నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రాఫిక్ సబ్ స్టాన్స్ యాక్ట్ ప్రకారం, మాదకద్రవ్యాలు అమ్మడం, సేవించడం రెండు నేరమని, వీటికి శిక్షలు కూడా ఉంటాయని చెప్పారు. డ్రగ్స్ రహిత వాతావరణాన్ని నెలకొల్పడానికి జిల్లా పోలీసు శాఖ పటిష్ట చర్యలు తీసుకుంటుందని, తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్సై సిహెచ్ సతీష్, హెడ్ కానిస్టేబుల్ చంద్రయ్య, వేణు, శ్రీనివాస్, మహిళా కానిస్టేబుల్ రజిత, పోలీసు సిబ్బందితోపాటు యువకులు పలువురు పాల్గొన్నారు.




## గాంధీలో గుర్తు తెలియని వ్యక్తి డెడ్ బాడీ



సికింద్రాబాద్ జూన్ 26 (ప్రజామంటలు): గాంధీ ఆసుపత్రిలో మరో గుర్తు తెలియని డెడ్ బాడీ వెలుగు చూసింది. చిలకలగూడ ఎస్.ఐ కిషోర్ కథనం ప్రకారం.... గాంధీ ఆసుపత్రి ఎమర్జెన్సీ బ్లాక్ ఎదురుగా ఉన్న ఎన్టీపీసీ వెయిటింగ్ హాల్ లో కింద పడి ఉన్న గుర్తు తెలియని డెడ్ బాడీ (40) ని చూసిన ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది వెంటనే చిలకలగూడ పోలీసులకు సమాచారం ఇచ్చారు. డెడ్ బాడీ వద్ద ఎలాంటి వివరాలు లభించకపోవడంతో డెడ్ బాడీని గాంధీ మార్చురీకి తరలించిన పోలీసులు బాడీని భద్రపరిచారు. ఫొటోలోని వ్యక్తి డెడ్ బాడీని గుర్తించిన వారు పీఎస్ లో సమాచారం ఇవ్వాలని ఎస్.ఐ విజ్ఞప్తి చేశారు.

## ప్రైవేటు పాఠశాలల అధిక ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా ఏబీవీపీ సంపూర్ణ బంధు

మహాదేవపూర్ జూన్ 26 (ప్రజామంటలు):



మహాదేవపూర్ మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బందు సంపూర్ణంగా జరిగింది. అనంతరం నగర కార్యదర్శి పేట సాయి మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల విద్యారంగం పట్ల మొండి వైఖరిని చూపిస్తుందని ప్రైవేటు పాఠశాలల్లో అక్రమంగా ఫీజులు దోపిడీ చేస్తూ విద్యార్థులను వేధిస్తున్నారు అని ప్రైవేటు పాఠశాలలో అక్రమంగా పుస్తకాలు, యూనిఫామ్స్ అమ్మడం ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా పాల్పడుతున్నాయని, వెంటనే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లను మరియు ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భారీ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించాలని లేదంటే ఏబీవీపీ ఆధ్వర్యంలో భారీ ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంజయ్ మింటు సాయి ఆకాష్ రవితేజ పాల్గొన్నారు.

**హైదరాబాద్ లోని డా. బి. ఆర్ అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార**



## ఓయూ జేఏసీ నేతకు గాంధీ ఆసుపత్రిలో బర్రెలక్క పరామర్శ, సంఘీభావం

సికింద్రాబాద్ జూన్ 26 (ప్రజామంటలు):




నిరుద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గాంధీ ఆసుపత్రిలో నిరాహార దీక్ష చేస్తున్న ఉస్మానియా యూనివర్సిటీ నిరుద్యోగ జేఏసీ నేత మోతీలాల్ నాయక్ ను బుధవారం శిరీష అలియాస్ బర్రెలక్క నిరుద్యోగ జేఏసీ నాయకులతో కలసి పరామర్శించి, సంఘీభావం తెలిపారు. ఎన్నికల ముందు నిరుద్యోగులకు తప్పకుండా ఉద్యోగాలు కల్పిస్తామన్న కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు వారి ప్రభుత్వంలో నిరుద్యోగులకు న్యాయం చేయాలని ఆమె కోరారు. మోతీలాల్ నాయక్ కు ఏదేని హాని జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని శిరీష పేర్కొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ నేత మోతీలాల్ నాయక్ మీడియాతో మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన నేతలు ఇప్పుడు జాప్యం చేయకుండా నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రూప్ 1, గ్రూప్ 2 లాంటి ఉద్యోగ నియామక నోటిఫికెషన్లను వెంటనే విడుదల చేయాలన్నారు. ఓయూలో తాను అమరణ దీక్ష చేస్తే పోలీసులు తీసుకొచ్చి, గాంధీ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారన్నారు. కాని తాను గత మూడు రోజులుగా ఎలాంటి ఆహారం తీసుకోవడం లేదని, డాక్టర్లు తమ ట్రీట్మెంట్ లో భాగంగా కేవలం సెలైన్లు పెడుతున్నారని అన్నారు.

## అప్సా ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ డే

### లాలాపేట లో అవెర్నెస్ ర్యాలీ

సికింద్రాబాద్ జూన్ 26 (ప్రజామంటలు):




అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిరోదక దినోత్సవాన్ని పురస్కరించుకొని అప్సా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పలు అవెర్నెస్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా సిటీలోని లాలాపేట ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఇండోర్ స్టేడియం నుంచి లాలాగూడ ఫ్లైఓవర్ వద్ద ఉన్న డా.అంబేద్కర్ విగ్రహం వరకు బ్యానర్లు, ప్లకార్డ్స్ ల తో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి,నివాళులు అర్పించారు. అలాగే ర్యాలీలో పాల్గొన్న వారంతా తాము డ్రగ్స్ కు వ్యతిరేకంగా పనిచేస్తామని మూకుమ్మడిగా ప్రతిజ్ఞ చేశారు. నేటి యువత క్షణిక సుఖం కోసం మత్తు పదార్థాలకు అలవాటు పడి, తమ విలువైన జీవితం నాశనం చేసుకుంటూ, వారి కుటుంబాలకు తీర్చలేని వేధనను మిగుల్చుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇంకా కఠిన చట్టాలు తీసుకొచ్చి, దేశం లో నుంచి గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలను పూర్తిగా తరిమి వేయాలని కోరారు. కార్యక్రమంలో అప్సా ప్రతినిధి బస్వరాజ్, మంజుల, సిబ్బందితో పాటు తార్నాక వెల్ఫేర్ అసోయేషన్ సభ్యులు శ్రీలత, యాంటీ నార్కోటిక్స్ డ్రగ్స్ ఎలిమినేషన్ కమిటీ సభ్యులు, వివిధ బస్తీల నాయకులు, పెద్దలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## మాదక ద్రవ్యాల వినియోగంతో దుష్పరిణామాలు ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి

రామ కిష్టయ్య సంగన భట్ల

**ధర్మపురి జూన్ 26 (ప్రజామంటలు):**

మాదక ద్రవ్యాల వినియోగంతో సమాజంలో దుష్పరిణామాలు చోటుచేసుకుంటాయని వాటి నిర్మూలన లో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని ధర్మపురి సీఐ ఎలపాటి రాం నర్సింహారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి, ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్ ల ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులు, ఆటో కార్మికులతో బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా తహశీల్దార్ కృష్ణ చైతన్య తో కలిసి సీఐ, ఎస్సై లు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ జరిపి గాంధీ చౌక్ వద్ద విద్యార్థులు, ఆటో డ్రైవర్లు మానవహారంగా ఏర్పడి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వినియోగంపై జరుగుతున్న పోరాటంలో భాగస్వామి అవుతానని డ్రగ్స్ భారిన పడకుండా తనవంతు బాధ్యతగా పోలీస్ శాఖ వారికి సమాచారం ఇస్తానని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సీఐ రాం నర్సింహారెడ్డి మాట్లాడుతూ.... మాదక ద్రవ్యాలు ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేస్తాయని ముఖ్యంగా ప్రస్తుత సమాజంలో పిల్లలు సైతం వాటికి అలవాటు పడుతుండటం బాధాకరమన్నారు. చెడు మార్గంలో పోకుండా మాదక ద్రవ్యాలను నిర్మూలించి డ్రగ్స్ రహిత జిల్లాగా చేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఆటో కార్మికులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

### - ముగ్గురు మిలిటెంట్ల మృతి

శ్రీనగర్ (ప్రజామంటలు): జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదుల కదలికలు కలకలం రేపాయి. దీంతో రంగంలోకి దిగిన భద్రతా దళాలు ముమ్మర గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో ముష్కరులకు, భద్రతా సిబ్బందికి మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. డోడా జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఉగ్రవాదులే ఇటీవల భారత సైన్యంపై కాల్పులు జరిపి ఉంటారని అనుమానిస్తున్నారు. ఘటనా స్థలం నుంచి భారీ స్థాయిలో మందుగుండు సామగ్రి, ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు ఇటీవల వరుస దాడులకు పాల్పడుతున్నారు. దీంతో డోడా, రాజౌరీ, పూంచ్ ప్రాంతాల్లో వీరిని ఏరివేసే ఆపరేషన్ ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం ఆపరేషన్ మొదలుపెట్టిన భద్రతా దళాలకు.. అక్కడ ఉగ్రవాదులు సంచరిస్తున్నారనే సమాచారం వచ్చింది. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వారిపై కాల్పులు జరిపాయి. ఇందులో ముగ్గురు కుట్రదారులు హతమయ్యారు. భద్రతా దళాలపై జూన్ 11న ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఐదుగురు సైనికులతో పాటు ఓ పోలీసు అధికారి తీవ్ర గాయాలపాలయ్యారు. మరో ఘటనలో పోలీస్ క్యాంపుపైనా దాడులు చేశారు. మరోవైపు భారత వాయుసేన కీలక స్థావరం ఉన్న పఠాన్ కోట్ జిల్లాలోనూ భారీ ఆయుధాలతో ఇద్దరు ఉగ్రవాదులు సంచరిస్తున్నట్లు భద్రతా దళాలు గుర్తించాయి. దీంతో అక్కడా హైఅలర్ట్ ప్రకటించారు.

## సీబీఐ అదుపులో కేజ్రీవాల్

### - ఢిల్లీ లిక్కర్ కేసులో మరో కీలక పరిణామం

న్యూఢిల్లీ (ప్రజామంటలు):

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ వ్యవహారంలో మనీల్యాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ ముఖ్యమంత్రి , ఆమ్‌ఆద్మీపార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజీవ్రాల్ ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్న విషయం తెలిసిందే. తాజాగా,ఇదే కేసులో కేజీవ్రాల్‌ను సిబిఐ అరెస్ట్ చేసింది.ఆయన అరెస్ట్‌కు కోర్టు బుధవారం అనుమతించడం తో రౌస్ అవెన్యూ కోర్టు లోనే సీబీఐ అదుపు లోకి తీసుకుంది. అనంతరం న్యాయమూర్తి అమితాబ్ రావత్ ఎదుట హాజరుపరిచిన అధికారులు ఐదు రోజుల కస్టడీకి కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఇదే కేసులో ట్రయల్ కోర్టు గత గురువారం కేజీవ్రాల్‌కు బెయిల్ మంజూరు చేయగా, దీనిపై ఈడీ హైకోర్టును ఆశ్రయించింది. దిగువ న్యాయస్థానం తమ వాదనలకు తగినంత సమయం ఇవ్వలేదని ఆరోపించింది. దీంతో ట్రయల్ కోర్టు ఉత్తర్వులపై హైకోర్టు స్టే విధించింది. ఈడీ సమర్పించిన ఆధారాలను ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకోవడంలో విఫలమైందని, బెయిల్ మంజూరులో నిర్ణయం తీసుకునేటప్పుడు సమగ్ర పరిశీలన చేయలేదని ఆక్షేపించింది. ఈ నేపథ్యంలో హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో కేజీవ్రాల్ పిటిషన్ వేశారు. అయితే హైకోర్టు నిర్ణయం వెలువడిన తరువాత దీనిపై విచారణ చేపడతామని స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పు వెలువడడంతో బుధవారం దీనిపై విచారణ చేపట్టింది.అయితే ఈ పిటిషన్‌ను తాజాగా కేజీవ్రాల్ తరఫున న్యాయవాదులు వెనక్కు తీసుకున్నారు. పిటిషన్ ఉపసంహరించుకుంటామని కేజీవ్రాల్ కోరగా, అందుకు జస్టిస్ మనోజ్‌మిశ్రా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిల ద్విసభ్య ధర్మాసనం అనుమతించింది. హైకోర్టు పూర్తిస్థాయి ఉత్తర్వులు, సిబిఐ అరెస్ట్ వంటి పరిణామాల నేపథ్యంలో సమగ్ర పిటిషన్ దాఖలు చేస్తామని కేజీవ్రాల్ తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ న్యాయస్థానానికి తెలిపారు. అయితే కేజీవ్రాల్ అరెస్ట్‌కు సీబీఐకి కోర్టు అనుమతివ్వడంపై ఆయన తరఫు న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇది అత్యంత పక్షపాతంతో కూడిన చర్యగా వ్యాఖ్యానించారు. ఇప్పటికే కేజీవ్రాల్‌ను 9 గంటల పాటు ఏప్రిల్‌లో సిబిఐ ప్రశ్నించిందని, ఆయన తరఫు న్యాయవాది విక్రమ్ చౌదరి అన్నారు. ఈ కేసు ఆగస్టు2022 నుంచి పెండింగ్‌లో ఉంది.. నన్ను సాక్షిగా పిలిచారు.. నేను హాజరయ్యాను. తొమ్మిది గంటల పాటు విచారణ జరిగింది. అప్పటి నుంచి ఒక్క నోటీస్ కూడా సిబిఐ నుంచి రాలేదు. సాక్షి నుంచి నిందితుడిగా ఎలా మారారు. ఇది చాలా దారుణం అని మండిపడ్డారు. తన వాదన వినిపిస్తూ కేజీవ్రాల్ దురుద్దేశంతో కూడిన అనవసర అరోపణలు చేస్తున్నారని సిబిఐ పేర్కొంది.

**కోర్టులో వాదనలు వినిపించిన కేజ్రీవాల్**

దేశ రాజధాని దిల్లీలో చోటుచేసుకున్న మద్యం కుంభకోణం వ్యవహారంలో బుధవారం కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈడీ కేసులో బెయిల్ కోసం ప్రయత్నిస్తున్న దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను నేడు సీబీఐ అరెస్టు చేసింది. ఆయనను కోర్టులో హాజరుపర్చగా.. కేసుకు సంబంధించిన సీఎం తన వాదనలను స్వయంగా వినిపించారు. ఈ కేసులో మనీశ్ సిసోదియా పేరు తానే చెప్పినట్లు వస్తున్న వార్తలను ఖండించారు."లిక్కర్ పాలసీ కుంభకోణంలో మొత్తం పాత్ర మనీశ్ సిసోదియా దే అంటూ వాంగ్మూలం ఇచ్చానని సీబీఐ (అఃఎ) వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. దీనిపై మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవం. సిసోదియాపై గానీ, ఇతర వ్యక్తులపై గానీ నేను ఎలాంటి నిందలు వేయలేదు. నేను, సిసోదియా, ఆమ్ ఆద్మీ పార్టీ అంతా అమాయకులం. మీడియాలో మాపై దుష్ప్రచారం చేయాలని సీబీఐ ప్లాన్ చేస్తోంది. అందుకే విశ్వసనీయ వర్గాల పేరుతో నకిలీ సమాచారాన్ని వ్యాప్తి చేసి సంచలనం సృష్టించాలని చూస్తోంది. దీనిపై స్పష్టత రావాలి" అని కేజ్రీవాల్ వాదించారు.కేజ్రీవాల్‌ను కోర్టులో హాజరుపర్చిన తర్వాత సీబీఐ తమ వాదనలు వినిపిస్తూ.. మద్యం దుకాణాలను ప్రైవేటీకరించాలని కేబినెట్ సహచరుడు (సిసోదియాను ఉద్దేశిస్తూ) సిఫార్సు చేశారని కేజ్రీవాల్ చెప్పినట్లు కోర్టుకు వెల్లడించింది. దీన్నే సీఎం ఖండించారు. ఈ కేసులో తనను సీబీఐ గతేడాది సాక్షిగా విచారించిన విషయాన్ని కేజ్రీవాల్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. మద్యం విధానానికి సంబంధించి తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అప్పుడే దర్యాప్తు సంస్థకు వెల్లడించినట్లు చెప్పారు.ఈ వాదనల అనంతరం కేజ్రీవాల్‌ను కస్టడీకి అప్పగించాలని సీబీఐ న్యాయస్థానాన్ని అభ్యర్థించింది. దీనిపై కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. మరోవైపు ఈడీ కేసులో కేజ్రీవాల్‌కు లభించిన బెయిల్‌పై హైకోర్టు స్టే విధించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రస్తుతానికి ఆయన తిహాడ్ జైల్లోనే ఉండాల్సి ఉంది.

# “హోమియో మందులు వాడకంలో అపోస్త్రవ హాలు తొలగించుకుందాం”

“అప్పిచ్చువాడు వైద్యుడు” అన్నారు మన పెద్దలు. అంటే ఆపదలో ఆదుకునే వారు వైద్యులతో సమానం అని అర్థం. అంటే వైద్యులు మనకు ఏ విధమైన వ్యాధి వచ్చినా సకాలంలో మనకి సరైన వైద్యం అందించి ఆ వ్యాధి వల్ల వచ్చే ప్రమాదం నుంచి మనల్ని కాపాడే ప్రాణదాతలు. అటువంటి ప్రాణదాతలు హోమియో వైద్యంలో కూడా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. కానీ మన భారత దేశంలో ఒకప్పుడు హోమియో వైద్యానికి, హోమియో వైద్యులకు కూడా పెద్దగా గుర్తింపు, ఆదరణ లేదు. అప్పట్లో ఈ మందుని చాలా తక్కువ మంది వాడే వారు. కానీ ఇప్పుడు హోమియో వైద్యానికి మంచి ప్రాచుర్యం లభించడం వల్ల దాదాపు 70 శాతం మంది హోమియోపతి వైద్యుల సేవల్ని ఉపయోగించుకుంటున్నారు. అయినా కూడా మనలో చాలామందికి ఈ మందు మీద అనేకమైన అపోహలు, అపనమ్మకాలు ఉండడం వల్ల కొద్ది రోజులు వాడి హోమియో వైద్యం ఆపివేసి అలోపతి వైద్య మొదలుపెడతారు. దీంతో ట్రీట్మెంట్ మళ్ళీ మొదటికి వచ్చి వ్యాధి తగ్గడానికి కొద్దిగా ఎక్కువ సమయం తీసుకుంటుంది.

హోమియో మందులు వాడితే వ్యాధి చాలా ఆలస్యంగా తగ్గుతుందనేది అపోహ చాలా మందిలో ఉంది. హోమియో మందులు కూడా వ్యాధిని వెంటనే తగ్గిస్తాయి. ఈ విషయం చాలామందికి తెలియదు. హోమియో వైద్య రంగంలో అన్ని రకాల దీర్ఘకాలిక మరియు అంటు వ్యాధులకు సైతం మందులు మనకు అందుబాటులో ఉన్నాయి. దీర్ఘవ్యాధులు విషయంలో ఈ వైద్యానికి మించిన వైద్యం మరొకటి లేదు. ఈ వైద్యంలో ఫ్యామిలీ బ్యాక్ గ్రౌండ్, వారసత్వపు లక్షణాలు, రోగి యొక్క మానసిక స్థితి, అలవాట్లు అన్నీ క్షుణ్ణంగా పరిశీలించి మందులు ఇస్తారు. మనం కూడా వైద్యుని వద్దకు వెళ్ళినప్పుడు జంకకుండా అన్ని విషయాలు వివరంగా చెప్తే మందులు కూడా చాలా కరెక్టుగా పడి వ్యాధి కూడా సాధ్యమైనంత త్వరగా నయమవుతుంది. దీర్ఘ రోగాలతో బాధపడే వారు ఈ విషయాలన్నీ జాగ్రత్తగా చెప్పాలి. పిల్లలు, పెద్దలు ఎవరైనా హోమియో మందులు చాలా తేలిగ్గా వాడవచ్చు. సూదులు, సిరంజీలు, స్పిరిట్ లు, నూరడాలు, కషాయాలు లాంటివాటితో పనిలేకుండా చాలా తేలికగా వాడవచ్చు. ఇతర మందులు లాగా ఈ మందులు వాడడం వల్ల పడకపోతే సైడ్ ఎఫెక్ట్స్ రావడం అనే సమస్య ఉండదు. అంటే మందులు పుచ్చుకున్నందువల్ల కడుపులో తిప్పటం, వాంతులు, విరోచనాలు లాంటి లక్షణాలు ఉండవు. అలాగే చర్మం మీద దద్దుర్లు, పొడలు లాంటి రియాక్షన్లు రావు. అలాగే హోమియో మందులు ఎంతకాలమైన చెడిపోవు. చెడిపోయిన మందులకి గుర్తు రంగు మారడమే. వీటిని చెమ్మ లేని ప్రదేశంలో పెట్టుకొని, సూర్యరశ్మి తగలకుండా తగుమాత్రం జాగ్రత్తలు పాటిస్తే చాలా ఏళ్ళ పాటు మందులు చెడిపోకుండా ఉంటాయి.

హోమియో మందులు వాడేటప్పుడు ఖచ్చితమైన సమయాలు పాటించాలని చాలామంది ఈ మందుని వాడరు. ఇది చాలా కష్టం అని చాలామంది అనుకుంటారు. అంటే మందు వేసుకోవడానికి ఆహారానికి ముందు, ఆహారం తీసుకున్న తర్వాత ఒక అరగంట సమయం ఇవ్వాలి. ఇది పెద్ద కష్టం కాదు. మామూలుగా మనం ఏ రకమైన మందు వేసుకున్నా కూడా ఆహారం తీసుకునే ముందు కానీ తీసుకున్న తర్వాత కాని ఆహారంలో కలిసి పోయి సరిగ్గా పనిచేయకపోవచ్చు. కొంచెం గ్యాప్ ఇచ్చి వేసుకుంటే మందు అద్భుతంగా పనిచేస్తుంది. పిల్లలకి ముఖ్యంగా హోమియో మందులు వాడడం వల్ల డబ్బు, శ్రమ, కాలం ఆదా అవుతుంది. పిల్లలకి సీజనల్ గా వచ్చే కలరా, టైఫాయిడ్, మలేరియా, డయేరియా, పొంగు, దగ్గు, జలుబు, ఫ్లూ జ్వరాలు, కామెర్లు మొదలైన అనేక రకాలైన వ్యాధులకు హోమియోలో చక్కటి మందులు ఉన్నాయి. ఈ మందులు పిల్లలకు వేయడం చాలా సులభంగా ఉండడం వల్ల పిల్లలు కూడా ఎంతో ఇష్టంగా వేసుకుంటారు. అదే ఇతర మందులు అయితే పిల్లలకి పొడి చేసి వేయాలి. బాగా చేదుగా ఉండడంవల్ల బలవంతంగా వేసినా కూడా ఒక్కోసారి వాంతి చేసుకుంటారు. అదే హోమియోలో అయితే ఈ సమస్య ఉండదు. అలాగే పిల్లలకి వ్యాక్సిన్స్ వేయిస్తున్నా కూడా చిన్నప్పటి నుంచి హోమియో మందులు అలవాటు చేస్తే మనం పసిపిల్లల్ని అనేక రకాల అంటువ్యాధులు నుండి రక్షించిన వారమవుతాము. తరచుగా మోషన్స్ అయ్యే పిల్లలకి ఒక్కోసారి మోషన్స్ ఎక్కువ అయితే ఇతర మందులు వాడితే కంటిన్యూగా సెలైన్ బాటిల్స్ ఎక్కించాల్సి వస్తుంది. అలాగే ఇంజక్షన్స్ కూడా చేయాల్సి వస్తుంది. అదే హోమియో మందులు అయితే ఒక రోజులో త్వరగా తగ్గిపోతాయి. ఆధునిక వైద్య సదుపాయం మనకి ఇప్పటికే హోమియోవైద్యంలో అందుబాటులో ఉంది. అన్ని రకాల అంటువ్యాధులకు పిల్లలకు తక్కువ పొటెన్సీలో మందులు ఉన్నాయి. ఈ మందులకి పెద్దగా కఠిన పత్యాలు ఏమి చెయ్యక్కర్లేదు. మనం నివసించే చుట్టుపక్కల ఎక్కడైనా అంటువ్యాధులు సోకితే తరచు హోమియో మందులు వాడే పిల్లలకి ఈ వ్యాధులు అసలు సోకవు.



ఎండాకాలం పిల్లలకు, పెద్దలకు శరీరమంతా పేలి మంట పుడుతుంది. ఈ పేలుడు వల్ల పిల్లలు బాగా బాధ పడుతుంటారు. తగ్గడానికి అనేకరకాలైన కాస్మోటిక్ పౌడర్లు, క్రీములు, రకరకాల సబ్బులు వాడుతుంటారు. హోమియోలో అయితే చక్కని మెడికేటెడ్ పౌడర్లు ఉన్నాయి. వీటిలో దేనినైనా ఒకదానిని రోజుకి రెండు, మూడు సార్లు వాడినా కూడా ఏ విధమైన దురదలు, దద్దుర్లు, మంటలు ఉండవు. పేలుడు కూడా ఇట్టే మాయమవుతుంది. “ప్రివెంట్ ఈజ్ బెటర్ దాన్ క్యూర్” అన్నారు పెద్దలు. అంటే వ్యాధి వచ్చిన తర్వాత నయం చేసుకునే కంటే ఆ వ్యాధి రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ఈ నగ్న సత్యాన్ని హోమియోపతి వైద్యం అక్షరాల నిజం చేస్తుంది. అంటే మన చుట్టుప్రక్కల పిల్లలెవరికైనా ఆటలమ్మ, కామెర్లు, కోరింత దగ్గు, గవదబిళ్లలు, మెదడువాపు వ్యాధి మొదలైనవి వస్తే మన పిల్లలకు ఆ వ్యాధి సోకకుండా వ్యాధిని బట్టి ప్రివెంటివ్ మెడిసిన్ ఇస్తారు హోమియో వైద్యులు. ఈ మందుని వ్యాధి “సోకని” పిల్లలకి వేస్తే పై వ్యాదులేవి పిల్లల దరిచేరవు. వ్యాధుల బారిన పడకుండా మన పిల్లల్ని రక్షించిన వాళ్ళమవుతాము. “గోటితో పోయేదానికి గొడ్డలి దాక తెచ్చుకోవడం ఎందుకు!” అన్న సామెతను గుర్తు చేసుకుంటూ చిన్నచిన్న వ్యాధులకి కూడా అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు పెట్టకుండా ఇలా మనకున్న అవగాహనతో దగ్గర్లోని హోమియో వైద్యుని సంప్రదించి చక్కని మందులు సులభతరమైన పద్ధతిలో వాడి అందరం సంపూర్ణ ఆరోగ్యంతో జీవిద్దాం.

**పింగళి భాగ్యలక్ష్మి,**
**కాలమిస్టు రచయిత్రి (ఫ్రీలాన్స్ జర్నలిస్టు),**
**గుంటూరు. 9704725609**



## గ్రామ పంచాయతీ, అంగన్వాడీ సెంటర్, పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

రాయికల్ జూన్ 26 (ప్రజామంటలు):

మండలంలోని అల్లిపూర్ గ్రామ పంచాయతీని, అంగన్ వాడి సెంటర్ ను, పాఠశాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... గ్రామ పంచాయతి ద్వారా పంపిణీ మందులు దేనికోసం ఇస్తున్నారు, ఇక్కడ ఎంత మంది పేషెంట్లు ఉన్నారు, బి.పి. షుగర్ వ్యాధి ఉన్నవారికి మందులు పంపిణీ చేస్తున్నారా, వారికి సంబంధించిన టెస్టులు నిర్వహిస్తున్నారా లేదా అని పల్లె డాక్టర్ ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీలలో రికార్డుల నమోదు సరిగా ఉన్నాయా లేదా అని రికార్డులను పరిశీలించారు. హరిత హారంలో భాగంగా నర్సరీ మొక్కలను కలెక్టర్ పరిశీలించి ఎన్ని మొక్కలు ఉన్నాయి, ఏ మొక్కలు ఎక్కువగా పంపిణీ జరుగుతుంది, ఇంట్లో పెంచుకునే మొక్కలు ఏమేమి ఉన్నాయి అని అడిగారు. మొక్కలకు నీరు పోసి సంరక్షించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అంగన్ వాడి సెంటర్ ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఎంతమంది విద్యార్థులకు ఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నారని, పిల్లలకు అర్థమయ్యే విధంగా నాణ్యమైన చదువు నేర్పిస్తున్నారా అని కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసకున్నారు. అదే విధంగా రాయికల్ మున్సిపాలిటీలో డ్రైనేజి వ్యవస్థను, చెరువులను కలెక్టర్ పరిశీలించారు. ముంపు ప్రాంతాలలో గల చెరువును కలెక్టర్ పరిశీలించారు. వర్షాకాలంను దృష్టిలో ఉంచుకుని నీటి నిల్వలు ఉండకుండా, ఇండ్లలోకి నీరు వెళ్ళకుండా నీటిని దారి మళ్లించి పెద్ద డ్రైనేజిని నిర్మించడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బోర్నపల్లిలో ఇసుక డంపును కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ వెంట జగిత్యాల ఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, డిప్యూటీ సి.ఈ.ఓ. రఘువరన్, ఎమ్మార్వో మహమ్మద్ ఖయ్యూం, ఎంపీడీఓ, ఎం.పి.ఓ, వివిధ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో జెడ్పి చైర్ పర్సన్ సమీక్ష





జగిత్యాల జూన్ 26 (ప్రజామంటలు):

జిల్లా పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జగిత్యాల జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... మండలాల్లోని ప్రతి గ్రామంలో పారిశుధ్యం మరియు సానిటేషన్ ఎప్పటికప్పుడు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. రానున్నది వర్షాకాలం సందర్భంగా ఎలాంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య మరియు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని అన్నారు. రాష్ట్రంలో జిల్లాను ప్రథమ స్థానంలో ఉండే విధంగా ప్రతి ఒక్క మండల అధికారి కృషి చేయాలని అధికారులను కోరారు. జిల్లాలోని మండల అభివృద్ధిలో భాగస్వామ్యమైన మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతూ వారిని సన్మానించారు. మండలాల్లోని ప్రతి గ్రామంలో మత్తు పదార్థాల నివారణలో ఎంపీడీవోలు ప్రముఖ పాత్ర పోషించాలని అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) మరియు జెడ్పీ సీఈఓ రఘువరణ్ మరియు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.




## మాదక ద్రవ్యాల నియంత్రణ అందరి బాధ్యత

జగిత్యాల జూన్ 26 (ప్రజామంటలు):

మాధక ద్రవ్యాల నియంత్రణ కోసం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా పాటుపడాలని ప్రముఖ న్యాయవాది, జన వికాస సొసైటీ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి భీమనాతిని ఉమాదేవి అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జగిత్యాల పట్టణంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ.... దేశ భవిష్యత్తు యువత పైనే ఆధారపడి ఉంటుందని, ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి కలిగిన భారత దేశంలోని యువత మత్తు పదార్థాలకు, మాదకద్రవ్యాలకు అలవాటు పడితే దేశ భవిష్యత్తు అందకారమవుతుందన్నారు.పాశ్చాత్య సంస్కృతికి అలవాటుపడ్డ కొంతమంది యువత మత్తు పానీయాలు, డ్రగ్స్ లాంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడి వారి ఉజ్వల భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాలకు యువత బానిసలు కాకుండా అడ్డుకునే బాధ్యత ప్రతి పౌరుడిపై ఉంటుందని తెలిపారు. మాదక ద్రవ్యాలకు యువత బానిసలు కాకుండా వారికి అవగాహన కల్పించి నైతిక విలువలు పెంపొందించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. మత్తు పానీయాలు, డ్రగ్స్ కు బానిసలై అనారోగ్యంతో బాధపడుతున్న వారికి జన వికాస సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా చికిత్సను అందిస్తున్నామని తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని కృష్ణ నగర్ శంకర్ హాస్పిటల్ లో డ్రగ్స్ బాధితులకు అవగాహనతో పాటు ఉచితంగా చికిత్సను అందించడం జరుగుతుందని తెలిపారు.

# డ్రగ్స్, గంజాయి నివారణకు జిల్లా పోలీసు శాఖ పటిష్ట చర్యలు

### గంజాయి రహిత జిల్లాగా మార్చడమే మా లక్ష్యం - ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల జూన్ 26 ( ప్రజామంటలు):

ప్రపంచ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ర్యాలీని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్ జండా ఊపి ప్రారంభించారు. ఈ యొక్క ర్యాలీ కొత్త బస్టాండ్ నుండి కలెక్టరేట్ వరకు నిర్వహించడం జరిగింది. మాదకద్రవ్యాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రతిజ్ఞ చేయడం జరిగింది. అనంతరం జెఎన్ టియు ఇంజనీరింగ్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలన గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రపంచ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని డ్రగ్స్ కు యువత బానిస కావద్దు–బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్ యువతకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే పరిణామాల పై అవగాహన చేయడంతో పాటు వినియోగించడం వల్ల కలిగే నష్టలపై యువతకు, పాఠశాల, కళాశాల విద్యార్థులకు దిశా నిర్దేశం చేసే కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందని, పోలీస్ కళాబృందం జిల్లా లో ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై అనునిత్యం దృష్టిపెట్టాలని ప్రవర్తనలో మార్పులు ఎప్పటికప్పుడు గమనిస్తు సరైన మార్గ నిర్దేశం చేయాలని సూచించారు. డ్రగ్స్ కు అలవాటు పడిన తర్వాత బాధపడితే ప్రయోజనం లేదని భవిష్యత్తు ను అందకారంలోకి నెట్టిన వారవుతారని అన్నారు. మాదకద్రవ్యాలు అమ్మడం, సేవించడం రెండు నేరమని అన్నారు. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రాఫిక్ సబ్ స్టాన్స్ యాక్ట్ ప్రకారం శిక్షార్హులు అవుతారని అన్నారు. చట్టాలు బలంగా ఉన్నాయని తర్వాత బాధపడి లాభం లేదని అన్నారు. జిల్లాలో డ్రగ్స్ రహిత వాతావరణ నెలకొల్పేందుకు ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందిని వివిధ శాఖల అధికారులతో కలిసికట్టుగా పని చేసి డ్రగ్స్, గంజాయి రహిత జిల్లాలుగా మార్చడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాంబాబు, డీఎస్పీ రఘు చందర్, టౌన్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, రూరల్ సి.ఐ కృష్ణారెడ్డి, సిసిఎస్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ మరియు ఎస్.ఐ. లు ఎక్సైజ్ అధికారులు, ఇతర శాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.






## దళిత జనోద్ధారకుడు చత్రపతి సాహు మహారాజ్

జగిత్యాల జూన్ 26 (ప్రజామంటలు):

దళిత, బలహీన వర్గాల అభ్యున్నతికి, సామాజిక గౌరవానికి ఎనలేని కృషి చేసిన వ్యక్తి చత్రపతి సాహు మహారాజ్ అని సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆకుతోట వెంకటరమణారెడ్డి అన్నారు. చత్రపతి సాహు మహారాజ్ 150వ జయంతి కార్యక్రమాన్ని జగిత్యాల మండలం, ధర్మారం గ్రామంలో నిర్వహించారు. సాహు మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.... సంఘసంస్కర్త, రిజర్వేషన్ల పితామహుడు, బడుగు బలహీనవర్గాలు, పేదల పాలిటి పెన్నిధి అయిన సాహుమహా రాజ్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు ఆర్థికసాయాన్ని అందించడమే కాకుండా పూలే అడుగుజాడలో నడుస్తూ మహిళలకు చట్టపరమైన హక్కులు,దళిత, బహుజనులలో విద్యా వ్యాప్తి కోసం కృషి చేసిన మహనీయుడు సాహు మహారాజ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గోస్కుల గంగాధర్, లింగారెడ్డి సమరసత వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు కనికరం లచ్చన్న ప్రధాన కార్యదర్శి సోమిరెడ్డి భూమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సన్మానించిన ఎన్ఆర్ఐ లు

**కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పార్టీ గుర్తింపునిస్తుంది**

**ఆస్ట్రేలియా న్యూ సౌత్ వెల్స్ రాష్ట్ర అధ్యక్షులు మర్రి మనోజ్ రెడ్డి**

జమ్మికుంట జూన్ 26 (ప్రజామంటలు):



కష్టపడి పని చేస్తున్న ప్రతి కార్యకర్తను పార్టీ అధిష్టానం గుర్తిస్తుందని, కష్టానికి తగ్గ ప్రతిఫలం వస్తుందని చెప్పడానికి నిదర్శనం ఇటీవల యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్గా నియామకమైన సజ్జద్ మహమ్మద్ అని ఆస్ట్రేలియా న్యూ సౌత్ వెల్ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి మనోజ్ రెడ్డి తెలిపారు. ఇటీవల నూతనంగా హుజురాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్గా నియామకమైన మహమ్మద్ సజ్జును బుధవారం శాలువాతో సత్కరించాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ....గత 20 సంవత్సరాలుగా పార్టీ కోసం పని చేస్తున్న మహమ్మద్ సజ్జును అందరూ ఆదర్శంగా తీసుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చాడు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ ఎస్ వై థామస్, పంజలా మహేష్, నివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమర్జెన్సీ ఓ చీకటి అధ్యాయం



### సభలో ప్రస్తావించిన స్పీకర్ ఓం బిర్లా

### విపక్షాల తీవ్ర అభ్యంతరం మధ్య సభలో మౌనం పాటింపు

న్యూఢిల్లీ,జూన్26 (ప్రజా మంటలు): లోక్‌సభ స్పీకర్‌గా వరుసగా రెండోసారి ఎన్నికైన ఓం బిర్లా సభలో చేసిన తొలి ప్రసంగం సందర్భంగా ఆయన 'ఎమర్జెన్సీ అంశాన్ని ప్రస్తావించారు. అత్యయిక స్థితి నాటి విషాదాన్ని గుర్తుచేసుకుంటూ సభలో మౌనం పాటించారు. అయితే, స్పీకర్ ప్రసంగంపై కాంగ్రెస్ సహా విపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. సభాపతిగా ఎన్నికైన ఓం బిర్లాకు ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా సభ్యులు అభినందనలు తెలిపారు. అనంతరం ఓం బిర్లా 'ఎమర్జెన్సీ'పై తీసుకొచ్చిన తీర్మానాన్ని చదవి వినిపించారు. 1975 జూన్ 25 మన దేశ చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది. ఆ రోజున అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ని విధించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారు. ప్రపంచంలోనే మనం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు సాధించాం. ఆ ప్రజాస్వామ్య విలువలు, చర్చలు దేశాన్ని ముందుకు నడిపిస్తాయి. కానీ, నాటి ప్రధాని ఇందిరాగాంధీ నియంతృత్వాన్ని అమలు చేశారు. ప్రజాస్వామ్య సూత్రాలు, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను అణగదొక్కారు. ప్రతిపక్ష నేతలను జైల్లో పెట్టారు. మీడియాపై ఆంక్షలు విధించారు. యావత్ దేశం కారాగారంగా మారిపోయిందని స్పీకర్ గుర్తుచేశారు. నాటి ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించడాన్ని ఈ సభ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ప్రజాస్వామ్య రక్షణ కోసం అత్యయిక స్థితిని ఎదిరించిన వారిని తాము అభినందిస్తున్నామని ఓం బిర్లా అన్నారు. అనంతరం నాటి చీకటి రోజులకు నివాళిగా సభలో ఒక నిమిషం పాటు మౌనం పాటిద్దామని సభ్యులను కోరారు. అనంతరం సభను గురువారానికి వాయిదా వేశారు. అయితే, స్పీకర్ మాట్లాడుతున్న సమయంలో కాంగ్రెస్ సహా విపక్ష నేతలు నిరసన వ్యక్తం చేశారు. స్పీకర్ ప్రసంగంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఎమర్జెన్సీని స్పీకర్ తీవ్రంగా ఖండించినందుకు చాలా సంతోషంగా ఉంది. ప్రజాస్వామ్యం గొంతు నొక్కి అప్పటి ప్రభుత్వం సాగించిన అన్యాయాలను ఆయన ఎత్తిచూపారు. దాదాపు 50 ఏళ్ల క్రితం దేశంలో అత్యయిక స్థితిని విధించారు. దాని గురించి నేటి తరం తెలుసుకోవడం చాలా ముఖ్యం. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి.. ప్రజాభిప్రాయాన్ని అణచివేసి, సంస్థలు నాశనం చేసినప్పుడు సమాజం ఎలా ఉంటుందో చెప్పేందుకు నాటి రోజులే సరైన ఉదాహరణ. నియంతృత్వం ఎలా ఉంటుందో ఎమ్జగ్గన్సీ పరిస్థితుల నుంచి తెలుసుకోవచ్చు' అని మోదీ 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చారు.

# స్పీకర్ ఓంబిర్లాకు ప్రధాని మోడీ అభినందన

### ఎన్నో కీలక నిర్ణయాల్లో మీ పాత్ర ఉందని ప్రశంసలు

### విపక్షాలను గుర్తించి వారికి ప్రాధాన్యం ఇవ్వాలన్న రాహుల్



న్యూఢిల్లీ,జూన్26 (ప్రజా మంటలు): లోక్‌సభ స్పీకర్‌గా భాజపా ఎంపీ ఓం బిర్లా వరుసగా రెండోసారి ఎన్నికయిన సందర్భంగా ఓం బిర్లాకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు స్పీకర్‌గా ఆయన కీలక పాత్ర పోషిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. వరుసగా రెండోసారి స్పీకర్‌గా ఎన్నికైన మీకు లోక్‌సభ సభ్యులందరి తరఫున శుభాభినందనలు. గత కొన్ని దశాబ్దాలుగా సభాపతిగా పనిచేసిన వారంతా ఎలాంటి పోటీని ఎదుర్కోలేదు. మీరు ఎన్నికలో గెలిచి చరిత్ర సృష్టించారు. స్పీకర్ పదవి ఎంత కఠినమైందో మీకు బాగా తెలుసు. చాలా మంది లోక్‌సభ సభ్యులకు మీతో పరిచయం ఉంది. సభను సరైన దిశలో నడపడంలో స్పీకర్‌ది కీలక పాత్ర. లోక్‌సభ చరిత్రలోనే స్వర్ణయుగానికి మీరు నేతృత్వం వహించారు. గత ఐదేళ్లలో స్పీకర్‌గా మీ పదవీకాలంలో సభ 97శాతం పనిచేసింది. పాతికేళ్లలోనే ఇది అత్యధికం కావడం విశేషం. కొవిడ్ సమయంలోనూ సభ సజావుగా సాగేలా చూశారు. సభా మర్యాదను కాపాడేందుకు కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. అనేక కీలక బిల్లును ఆమోదించారు. వచ్చే ఐదేళ్లు సభ్యులందరికీ మార్గదర్శనం చేస్తారని విశ్వాసం ఉంది. కొత్త ఎంపీలకు మీరు స్ఫూర్తిగా నిలుస్తారు. మీ మధురమైన చిరునవ్వుతో సభ ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటుందని మోదీ ప్రశంసలు కురిపించారు. అనంతరం లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడారు. ఇండియా కూటమి తరఫున ఓం బిర్లాకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. ఈ సభ భారతదేశ జనవాణిని వినిపించాలి. ప్రభుత్వానికి రాజకీయంగా బలం ఉండొచ్చు.. కానీ విపక్షాలు ప్రజావాణికి ప్రాతినిధ్యం వహిస్తాయి. సభ సజావుగా నడపడంలో ప్రతిపక్షం మీకు పూర్తి సహకారం అందిస్తుంది. ప్రజావాణిని బలంగా వినిపించేందుకు విపక్షాలకు అవకాశమిస్తారని ఆశిస్తున్నా. విపక్షం గొంతు నొక్కడం ద్వారా సభను నడపటం అప్రజాస్వామికం అవుతుంది. మాకు మాట్లాడే అవకాశం ఇస్తారని విశ్వాసంగా ఉన్నాం అని రాహుల్ అన్నారు. పలువురు విపక్ష నేతలు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. స్పీకర్‌గా ఓం బిర్లా సభలో పక్షపాతం లేకుండా వ్యవహరించాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరారు. అఖిలేశ్ యాదవ్, టిఆర్ బాలు తదితరులు ప్రసంగగించారు. బిర్లను అభినందించి, విపక్షాల వాణికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సభాపతిగా ఓం బిర్లా ఎన్నికైనట్లు ప్రొటెం స్పీకర్ ప్రకటించిన తర్వాత.. ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్ ఆయన వద్దకు వచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయనను స్పీకర్ కుర్చీలో కూర్చోబెట్టారు. ఈ సందర్భంగా మోదీ, రాహుల్ షేక్‌హ్యాండ్ ఇచ్చుకున్నారు.

# రేవంత్ నాయకత్వంలో పనిచేస్తా..

పనిచేస్తానన్నారు. చివరి వరకు రాహుల్ గాంధీ నాయకత్వంలోనే పనిచేస్తానన్నారు. కొద్దిరోజుల నుంచి కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అధిష్టానం పిలుపుతో ఢిల్లీ వెళ్లారు. పార్టీలో సీనియర్ అయిన తనను సంప్రదించకుండా సంజయ్‌ను ఎలా పార్టీలో చేర్చుకుంటారని అక్కడ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయనను సముదాయించిన పెద్దల హామీలతో తాను కాంగ్రెస్ హైకమాండ్ హామీతో సంతృప్తి చెందినట్లు తెలిపారు. ఈ భేటీకి సహకరించిన వారికి కృతజతలు తెలిపారు. ఏది ఏమైనా పార్టీ ఐక్యంగా ఉండటమే తనకు ముఖ్యమన్నారు. కార్యకర్తలను, పార్టీ శ్రేణులను కలుపుకుని ముందుకు వెళ్తామన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో జరిగిన రాజకీయ పరిణామాల దృష్ట్యానే ఇక్కడికి వచ్చి కలిశామన్నారు. కేసీ వేణుగోపాల్, దీపాదాస్ మున్షీ, శ్రీధర్ బాబు ఇతర మంత్రులకు, సీనియర్ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది కలిగించమని కాంగ్రెస్ పెద్దలు కేసీ వేణుగోపాల్ చెప్పినమాటపై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తానన్నారు.

## ఫిరాయింపులపై ఆనాడు కేసీఆర్ ను ఎందుకు నిలదీయలేదు?

### - కేటీఆర్ కు విప్ ఆది శ్రీనివాస్ సూటి ప్రశ్న

తన ఫామ్ హౌస్ లో వీడ్కోలు పార్టీలు ఇస్తున్నాడన్నారు.. అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలకు ప్రగతి భవన్ గేట్లు ఎందుకు తెరుచుకోలేదని ప్రశ్నించారు. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్ పార్టీ పేరు మార్చుకున్నప్పుడే ఆ పార్టీకి తెలంగాణతో పేగు బంధం తెగిపోయిందన్నారు. రేవంత్ రెడ్డి తుఫాన్లో బీఆర్ఎస్ కొట్టుకుపోతుందని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ మునిగిపోతున్న నావ.. ఆ నావలో ఎవరూ ఉండరన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలను కేసీఆర్ హీనాతిహీనంగా చూశారన్నారు. తమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ ప్రజాప్రతినిధులకు గౌరవం ఆ ఇస్తున్నారన్నారు. బీఆర్ఎస్ మిగిలేది ఆ నలుగురు మాత్రమే..త్వరలో మరిన్ని చేరికలు ఉంటాయన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి పైన ఉన్న గౌరవంతోనే మా సీఎం ఆయన ఇంటికి వెళ్లారని గురు చేశారు.

# నాడు మేం చట్టబద్ధంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేను చేర్చుకున్నాం

### మీరు ఇంటికెళ్లి కండువాలు కప్పుతున్నారు

### ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి



హైదరాబాద్ (ప్రజా మంటలు): బీఆర్ఎస్ పార్టీ బీ ఫాంపై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన పోచారం శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సంజయ్ శాసనసభా సభ్యత్వాలను రద్దు చేయించి తీరుతామని సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల మీద పిటిషన్ ఇవ్వాలని 2 రోజుల నుండి స్పీకర్‌ని కలవాలని చూస్తే స్పీకర్ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ అంశంపై తెలంగాణ భవన్‌లో జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.బీఆర్ఎస్ బీ ఫాంపై గెలిచిన పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంజయ్ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇది పూర్తిగా చట్ట విరుద్ధం. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ఉన్నదని తెలిసీ కూడా పార్టీ మారడం అనేది సరైంది కాదు. చట్టం ప్రకారం వీరిద్దరి సభ్యత్వాలు కూడా రద్దు కావాల్సి ఉంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి స్పీకర్‌కు పిటిషన్ ఇచ్చేందుకు నిన్నటి నుంచి ప్రయత్నం చేస్తున్నాం. నిన్న స్పీకర్‌తో స్వయంగా మాట్లాడాను. ఎప్పుడు పిలిచినా వస్తామని చెప్పాను. వెసులుబాటు చూసుకుని పిలుస్తాను అని చెప్పారు. రాత్రి 8 గంటలకు వేచి చూశాం. అయినా స్పీకర్ నుంచి పిలుపు రాలేదు. ఇవాళ ఉదయం నుంచి కూడా ప్రయత్నం చేస్తూనే ఉన్నాం. స్పీకర్ ఓఎస్‌డీ ఫోన్‌లో అందుబాటులోకి వచ్చారు. వికారాబాద్‌లో స్పీకర్ ఉన్నారని చెప్పారు. ఏ సమయానికి అపాయింట్‌మెంట్ ఇస్తారో చెప్పాలని అడిగాం. కానీ స్పీకర్ స్పందించడం లేదని జగదీశ్ రెడ్డి తెలిపారు.ఇక తప్పని పరిస్థితుల్లో ఈ-మెయిల్‌తో పాటు స్పీడ్ పోస్టు ద్వారా పిటిషన్ స్పీకర్‌కు పంపాం. ఇదే సందర్భంలో శాసనసభ కార్యదర్శికి కూడా పంపించాం. స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారనే దానిబట్టి మా చర్యలు ఉంటాయి. చట్టపరంగా, న్యాయపరంగా మాకున్న అవకాశాలు వినియోగించుకుంటాం. ఇద్దరి సభ్యత్వాలు రద్దు చేయించడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తాం. చేయించి తీరుతాం అని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఘనంగా ఆషాఢ బోనాల ఉత్సవాల నిర్వహణ

### రూ.20 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం



హైదరాబాద్,జూన్26 (ప్రజా మంటలు): తెలంగాణలో ఆషాఢ బోనాల ఉత్సవాలనుల ఈ ఏడాది ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇందుకోసం ఉత్సవాల కోసం ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసింది. ఈ విషయాన్ని మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఈ ఉత్సవాలను నిర్వహించాలని దేవాదాయ శాఖ అధికారులను మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. గోల్కొండ కోటలో బోనాల జాతర ఉత్సవాలపై మంత్రులు కొండాసురేఖ, పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. మీటింగ్ కి అటెండ్ కానీ అధికారులపై మంత్రి కొండా సురేఖ సీరియస్ అయ్యారు. మీటింగ్ కు రాని అధికారులకు మెమోలు ఇష్యూ చేయాలని ఆదేశించారు. లక్షల మంది జరుపుకునే పండుగకు సంబంధించి మీటింగ్ పెడితే. మంత్రులు, మేయర్ వస్తే అధికారులు రారా అని ప్రశ్నించారు. గోల్కొండ కోటలో 9 వారలు బోనాలు సమర్పించే భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు మంత్రి. ప్రతి ఆదివారం, మంగళవారం, గురువారం భక్తులు వస్తారని తెలిపారు.

# ఓవైసీ లాంటివారితో దేశానికి ప్రమాదం

### ఇలాంటి వారిని పార్లమెంట్‌కు పంపడం ముప్పు

### అసదుద్దీన్ పార్లమెంట్ వ్యాఖ్యలపై మండిపడ్డ మాధీవీలత



హైదరాబాద్,జూన్26 (ప్రజా మంటలు): పార్లమెంట్‌లో ఎంపీగా ప్రమాణ స్వీకారం సందర్భంగా హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేత కొంపెల్ల మాధవీలత తీవ్రంగా స్పందించారు. ఒవైసీ పార్లమెంట్‌లో అల్లాహుఅక్బర్ తో పాటు జై పాలస్తీన్ అనడంపై ఆమె తీవ్ర అభ్యంతరం తెలిపారు. అల్లా అన్న నోటితో జై పాలస్తీన్ అనడం ఏంటని.. అతని ఉద్దేశాలు ఏంటని ప్రశ్నించారు. ఇలాంటి వారి వల్ల దేశ భద్రతకు ముప్పు అని.. తక్షణం ఇతణ్ని విచారణ చేయాల్సి ఉందని ఓ వీడియోను విడుదల చేశారు. 'పార్లమెంటులో జై బోలో భారత్ మాతాకీ అనాల్సిన నోటి నుంచి జై పాలస్తీనా అనే మాట ఆయన నోటి నుంచి వచ్చిందంటే.. దేశానికే దౌర్భాగ్యం. ఇలాంటివారిని ప్రోత్సహిస్తున్నందుకు 130 కోట్ల మంది భారతీయులు మనల్ని మనమే ప్రశ్నించుకోవాలి. రజాకార్ల నుంచి వచ్చి.. వారిని చంపి వారి ఎంఐఎం పార్టీని కైవసం చేసుకొని గత 40 నుంచి 50 ఏళ్ల నుంచి తెలంగాణలో పాలన చేస్తున్నారు. ఇక్కడ ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో.. వీరికి మద్దతివ్వడం ఆనవాయితీగా వస్తోందని మండిపడ్డారు. తమ్ముడు చిటికె వేస్తాడు.. 15 నిమిషాల్లో ఖబడ్దార్ ఈ దేశాన్ని శ్మశానం చేస్తా అంటాడు. నేను ఆపాను కాబట్టే అతను ఆగుతున్నాడు.. లేదంటే ఏం చేస్తాడో చూస్కోండి అని అన్న అంటాడు. వీరు ఏం చేస్తారు? జై పాలస్తీన్ అని పార్లమెంట్‌లో అన్నప్పుడు వీరి మనస్తత్వం ఏంటి? ఇలాంటి వారిని మనం పార్లమెంట్‌లోకి తీసుకొచ్చి కూర్చోబెడుతున్నాం. ప్రశ్నించేవారు లేరా? ఈ దేశ సంరక్షణ ఏ దిశగా వెళ్తోంది. 130 కోట్ల జనాభా మధ్యలో ఇలాంటి వారు మనతో ఉండడమే కాకుండా.. అక్రమ మార్గంలో ప్రజాప్రతినిధులై పార్లమెంటులో కూర్చొంటే దానికి రక్షణ ఎక్కడుంది? వీరు హమాస్ వాళ్లా? వారి కోసం పని చేస్తారా? హమాస్ ఆశయాలను భారత దేశంలో అమలు చేయడానికో.. లేదా వారిని సంతృప్తి పర్చడం కోసం ఇక్కడ పని చేస్తున్నారా? ఏ దేశంలో అయినా పుట్టిన వారు అదే తన మాతృభాష, మాతృభూమిని పాటించి, అదే తన జీవిత లక్ష్యం అని అనుకుంటారు. వీరి ఉద్దేశం అలా లేదు. వీరెప్పుడూ పేరు, ప్రఖ్యాతి, డబ్బు కోసం పరితపించే వికృతమైన వ్యక్తులు వీరు. భగవత్ నామం అల్లా అని పేరు చెప్పి.. జై పాలస్తీన్ అన్నాడంటే.. అతని మనస్సులోంచి వచ్చిన మాటలివి. అతను ఎందుకు ఈ మాటలు అన్నాడు. కచ్చితంగా జాతీయ భద్రతా మండలి వారు ఒవైసీని కూర్చోబెట్టి ప్రశ్నించాలి. అతని మదిలో ఏ ఆలోచనలు ఉన్నాయో తేల్చాలి. ఇప్పుడు కనుక మనం మేల్కోకపోతే, పరిష్కరించుకోకపోతే.. ఈ భారత్ శత్రువులకు పాలు పోసి పెంచినట్లు అవుతుంది' అని మాధవీ లత అన్నారు.

# ఢిల్లీలో తెలంగాణ ప్రతినిధిగా జితేందర్ రెడ్డి

### బాధ్యతలు స్వీకరించిన మాజీ ఎంపి



న్యూఢిల్లీ,జూన్26 (ప్రజా మంటలు): ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా జితేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి వారధిగా ఉంటానన్నారు. విభజన చట్టంలో పెట్టిన అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చి దిద్దేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. కృష్ణా నుంచి రావాల్సిన నీటి వాటా కూడా రాలేదన్నారు. సాగునీరు, త్రాగు నీరు సాధించడం కోసం రాజీలేని పోరాటం చేస్తానని చెప్పారు. బీబీనగర్ ఎయిమ్స్ విషయంలో కూడా కేంద్రం చాలా అంశాలను పెండింగ్ లో పెట్టిందని తెలిపారు. కేంద్రంలోని అన్ని మంత్రిత్వ శాఖలపై ఒత్తిడి తెస్తాం.. ఎన్నో పెండింగ్ సమస్యలు ఉన్నాయన్నారు. ఏపీ భవన్ విషయంలో ఎటువంటి అనుమతి అవసరం లేదన్నారు. ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణం కోసం కసరత్తు మొదలైందన్నారు. త్వరలోనే ఢిల్లీలో తెలంగాణాకు కొత్త భవనం నిర్మాణం జరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపిలు మల్లురవి,రఘురామి రెడ్డి,బలరాం నాయక్,చామల కిరణ్ కమార్ రెడ్డి,ఎమ్మెల్యేలు వివేక్, యన్నం శ్రీనివాస్ రెడ్డి,మల్‌రెడ్డి రంగారెడ్డి, శ్రీహరి,మాజీ మంత్రి జానారెడ్డి హాజరయ్యారు.

# రాహుల్‌గాంధీపై గురుతర బాధ్యత

- విపక్షనేతగా సమర్ధత చాటుకోవాలి
- ప్రజల సమస్యలపై చర్చకు పట్టుబట్టాలి
- ప్రభుత్వం అప్రమత్తంగా ఉండేలా కన్నేయాలి



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
చాలాకాలం తరవాత పార్లమెంటులో అధికార, విపక్షం గట్టిగా ఉన్నాయి. దాదాపుగా ఇరు పక్షాల బలాబలాలు ఇంచుమించు సమానంగా ఉన్నాయనే చెప్పాలి. ఈ క్రమంలో విపక్షాలు బలంగా ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశం ఉంది. లోక్‌సభలో చర్చలకు ప్రభుత్వం అవకాశం ఇవ్వడమే గాకుండా, బాధ్యతాయుంగా సమాధానం ఇవ్వగలగాలి. ఈ క్రమంలో లోక్‌సభలో విపక్ష నేతగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నియమితులయ్యారు. ఆయనపై ఇప్పుడు గురుతర బాధ్యత ఉంది. ప్రభుత్వం సక్రమ మార్గంలో నడిచేలా ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ సమర్థంగా పనిచేయాలి. ప్రభుత్వం చేసే తప్పుడు పనులను ఎత్తి చూపాలి. దశాబ్ద కాలం తర్వాత మళ్లీ లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కింది. మోదీని దీటుగా ఎదుర్కొనే సమర్ధనేత రాహుల్ ఒక్కడేననే అభిప్రాయంతో ఈ నెల 9న జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సమావేశం కూడా విపక్ష నేత విషయంలో ఏకగ్రీవంగా తీర్మానించింది. కాంగ్రెస్ అగ్రనేతల ఒత్తిడితో ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉండేందుకు రాహుల్ తన ఆమోదాన్ని ప్రకటించారు. ఆ వెంటనే కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ(సీపీపీ) చైర్‌పర్సన్ సోనియాగాంధీ ప్రొటెం స్పీకర్ భర్తృహరికి రాహుల్‌ను తమ పార్టీ తరపున ప్రధాన ప్రతిపక్ష నేతగా పేర్కొంటూ లేఖ రాశారు. గడిచిన పదేళ్లుగా లోక్‌సభలో విపక్ష నేత హోదా ఖాళీగా ఉంది. ఏదైనా పార్టీ లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష హోదాను పొందాలంటే.. మొత్తం సీట్లలో 10 శాతం స్థానాల్లో గెలిచి ఉండాలి. ప్రస్తుతం లోక్‌సభలో 543 సీట్లున్నాయి. అంటే.. ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కాలంటే 54 సీట్లు తప్పనిసరి. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మోదీ ప్రభంజనంతో.. కాంగ్రెస్ 44 సీట్లతో సరిపెట్టుకుంది. 2019లో కూడా కాంగ్రెస్ పార్టీ 52 స్థానాలను దక్కించుకోగా.. ప్రధాన ప్రతిపక్ష హోదాకు రెండు సీట్లు తక్కువ య్యాయి. ఈ సారి 99 మంది ఎంపీలుండడంతో.. కాంగ్రెస్ ప్రతిపక్ష హోదాను దక్కించుకుంది. లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేతకు ప్రత్యేక సభాహక్కులుంటాయి. లోక్‌సభలో సభ్యులకు సీట్లు, గదుల కేటాయింపులు, అధికారిక పత్రాల సరఫరా, పార్లమెంటరీ కమిటీల నియామకం, సభ రోజువారీ కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషిస్తారు. సీబీఐ చీఫ్, చీఫ్ విజిలెన్స్ కమిషనర్, కేంద్ర సమాచార హక్కు కమిషనర్, ఎన్నికల ప్రధాన కమిషనర్, ఇతర కమిషనర్ల నియామకానికి సంబంధించిన ప్యానెళ్లలోనూ ప్రధాన ప్రతిపక్ష నేత సభ్యుడిగా ఉంటారు. వీటితోపాటు.. లోక్‌సభలో ప్రజల గళాన్ని వినిపించే అవకాశం విపక్ష నేతకు ఎక్కువగా ఉంటుంది. అదే సమయంలో సభలో అనేక అంశాలను చర్చించేందుకు ఎజెండాను సెట్ చేసే అవకావం కూడా వస్తుంది. అనేక అంవాలపై చర్చను ఇప్పుడు రాహుల్ చేపట్టాల్సి ఉంటుంది. అలాగే ప్రభుత్వం కూడా ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మడం మానుకోవాలి. సంస్థలను బలోపేతం చేస్తూ..నిరుద్యోగ సమస్యలను పరిష్కరించగలగాలి. ఉచిత పథకాల పేరుతో వేలకోట్ల వృధాను అడ్డుకోవాలి. ఉచిత పథకాలపై దేశవ్యాప్త చర్చసాగాలి. అలాగే ఉచితాలతో మన ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులను కట్టడి చేయాలి. విద్వేషాగ్నులు పెచ్చరిల్లేలా విదేశీ గడ్డపై నుంచి వస్తున్న సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో ప్రజలు, ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వానికి అండగా నిలవాలి. విపక్షాలు ఇక కాశ్మీర్‌పై విమర్శలు కట్టిపెట్టాలి. కలసికట్టుగా ముందుకు సాగాలి. ఆనాటి పాలకుల దూరదృష్టి లోపం కారణంగా మనకు వారసత్వంగా వచ్చిన సకల అవలక్షణాలు ప్రజలను ఇంకా దరిద్రంలోనే ముంచెత్తుతున్న వేళ పాలకులు గతాన్ని నెమరేసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ఇంతకాలం ఎక్కడ లోపం ఉందో గుర్తించి అవలోకనం చేసుకోవాలి. జోడో యాత్రల సందర్భంగా రాహుల్ అనేక వర్గాలను కలిశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కూడా నిరుద్యోగిత, ధరల పెరుగుదల, మహిళా సమానత్వం, సామాజిక న్యాయంపై హామీలు ఇచ్చింది. ఈ అంశాలపై పార్లమెంట్‌లో గళమెత్తాల్సిన అవరముంది. అది ప్రతిపక్షనేతగా రాహుల్ తన సామర్థ్యాన్ని ప్రదర్శించాలి.

# ఉస్మానియా,గాంధీ ఆసుపత్రుల్లో వసతిగృహాల నిర్మాణం

## జూడాలకు ఇచ్చిన హామీల మేరకు జివోల విడుదల

హైదరాబాద్, (ప్రజా మంటలు):
జూనియర్ డాక్టర్లకు ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ప్రభుత్వం రెండు జీవోలను జారీ చేసింది. ఉస్మానియా,గాంధీ ఆసుపత్రుల జూడాల వసతిగృహాల నిర్మాణానికి జీవో విడుదల చేసింది. కాకతీయ వైద్య కళాశాలలో రహదారుల పునరుద్ధరణకు నిధులు విడుదల చేస్తూ జీవో జారీ చేసింది. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులతో పాటు కాకతీయ వర్సిటీకి రూ.204.85 కోట్లు కేటాయించింది. ఉస్మానియా వసతి భవనాలు, రోడ్లకు రూ.121.90 కోట్లు, గాంధీ ఆసుపత్రికి 79.50 కోట్లు, కాకతీయ వర్సిటీలో సీసీ రోడ్లకు రూ.2.75 కోట్లు మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది. మరోవైపు గాంధీ ఆసుపత్రిలో జూడాలు సమావేశమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలల నుంచి హాజరయ్యారు. వైద్యారోగ్యశాఖ మంత్రి, ఉన్నతాధికారులతో మరోసారి సమావేశమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జూడాలు తమ డిమాండ్లపై అంతర్గత చర్చలు జరుపుతున్నారు. సమ్మెను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు జూనియర్ డాక్టర్లు (జూడా) ప్రకటించిన విషయం తెలిసిందే. డీఎంఈ, ఆరోగ్య శాఖ అధికారులతో మంగళవారం అర్ధరాత్రి వరకు వారు చర్చలు జరిపారు. ఈక్రమంలో గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో జూడాల వసతి భవనాల ఏర్పాటుకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. కాకతీయ వర్సిటీలో రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామని తెలిపింది. బుధవారం ఇందుకు సంబంధించి రెండు జీవోలు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. జీవోలు విడుదల కాకపోతే మళ్లీ సమ్మె కొనసాగిస్తామని జూడాలు స్పష్టం చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వం తాజాగా రెండు జీవోలు విడుదల చేసింది.

# వ్యవసాయ అనుబంధ రంగాలు బలపడాలి

## ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహించాలి - ఉపాధిరంగాలుగా బలోపేతం చేయాలి



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
వ్యవసాయరంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారేలా ప్రణాళికలు రూపొందించు కోవాల్సిన అసవరం ఉందని వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పుడు పండుతున్న పంటలకు కూడా సరైన ప్రాసెసింగ్ యూనిట్లు లేవని అంటున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని అంటున్నారు. సస్యవిప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకోవాల్సిన తరుణమిదేనని అన్నారు. కూలీ కోసం పట్టణాలకు తరలి వెళుతున్న వారిని ఆదరించి వ్యవసాయం వైపు మళ్లించాలని అన్నారు. అలా చేయడం వల్ల ఆధునిక వ్యవసాయరంగం మారగలదని అన్నారు. తెలంగాణలో ఇలాంటి యూనిట్లు పెట్టేవారిని ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఇంకా అవి అమల్లోకి రాలేదు. బహుళ జాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలి. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరాఘాతంగా మారింది. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమి సారం తగ్గుతోంది. ఏ పంటపండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. దీనికి తాజా ఉదాహరణ కంది, మిర్చి పంటలే. రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందించాలి. ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. వంటనూనెల మిల్లలును దేశీయంగా రూపొదించి, మన నూనెలను మనమే వాడగలిగేలా చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్న ప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం లేకున్నా ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. ఇతర దేశాల నుంచి ఆహార ధాన్యాల దిగుబడి తక్షణం ఆగిపోవాలని అన్నారు. అప్పుడు మన అసవరాలకు అనగుణంగా పంటల విధానం వస్తుందని అన్నారు. దేశీయంగా ఉపాధి అవకాశాలు పెంచుకుంటూ.. ఉత్పత్తి రంగాలకు ఊతమిచ్చేలా సాగాల్సి ఉంది. అందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను పెంచుకోవాల్సి ఉంది.

# పఠాన్‌కోట్‌లో ఉగ్రవాదుల సంచారం

## భద్రతాదళాల గాలింపు ముమ్మరం

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
భారత వాయుసేన కీలక స్థావరం ఉన్న పఠాన్ కోట్ జిల్లాలో భారీ ఆయుధాలతో ఇద్దరు ఉగ్రవాదులు సంచరిస్తున్నట్లు భద్రతా దళాలు గుర్తించాయి. దీంతో బుధవారం జిల్లాలో హైఅలర్ట్ ప్రకటించారు. పలు గ్రామాల్లో దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. బోర్డర్ రేంజి డీఐజీ రాకేశ్ కుశాల్ మాట్లాడుతూ గత రాత్రి అనుమానాస్పద కదలికలను గుర్తించినట్లు పేర్కొన్నారు. దీంతో ఆ ప్రాంతాన్ని పూర్తిగా చుట్టుముట్టినట్లు తెలిపారు. ఇప్పటికే బీఎస్ఎఫ్, సహా అన్ని సెక్యూరిటీ ఏజెన్సీలకు అలర్ట్‌లు జారీ చేశామన్నారు. పఠాన్‌కోట్ ఎస్ఎస్‌పీ సుహైల్ ఖాసీం మిర్ ఈ వివరాలను వెల్లడిస్తూ.. ఇద్దరు సాయుధులు కోట్ భట్టియాన్ గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్నట్లు గుర్తించాం. ఈ ప్రాంతం జమ్మూ కశ్మీర్‌లోని కథువా జిల్లాతో సరిహద్దులు పంచుకొంటోంది. ఈ అనుమానితులే కథువాలోని కోట్ పన్నూలో కూడా సంచరించినట్లు తెలిసింది‘ అని వెల్లడించారు. ఈ నెల 12వ తేదీన పాక్ నుంచి కథువా జిల్లా సుక్‌పాల్ గ్రామంలోకి చొరబడిన ఇద్దరు అనుమానితులను భద్రతా దళాలు కాల్చిచంపాయి. 2016 జనవరిలో పఠాన్‌కోట్‌లోని వాయుసేన స్థావరంపై ఉగ్రవాదులు విరుచుకు పడ్డారు. అప్పట్లో కూడా వారు తొలుత వీధుల్లో తిరుగుతూ వాహనాలను హైజాక్ చేసి ఎయిర్‌ఫోర్స్ బేస్‌లోకి ప్రవేశించారు. ఆ తర్వాత అక్కడే భారీగా పెరిగిన గడ్డిలో నక్కారు. తెల్లవారు జామున సిబ్బంది క్వార్టర్స్‌లోకి ప్రవేశించి దాడి చేసి పలువురి ప్రాణాలను బలిగొన్న విషయం తెలిసిందే. వీరిని పూర్తిస్థాయిలో మట్టుబెట్టడానికి కొన్ని రోజులు వాయుసేన, ఇతర భద్రతా దళాలు శ్రమించాల్సి వచ్చింది. నాడు ఎయిర్‌ఫోర్స్ కీలక ఆయుధ సంపత్తికి ఎటువంటి నష్టం జరగకపోవడమే పెద్ద ఊరట.

# వర్షాభావ పరిస్థితులపై అధ్యయనం చేయాలి

## నదుల అనుసంధానం దిశగా అడుగులు వేయాలి

## దేశంలో పర్యావరణ విధ్వంసం జరక్కుండా చూడాలి



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
వర్షాభావ పరిస్థితులు పదేళ్లకోసారి తప్పవని నిపుణులు అంటున్నారు. నైరుతి ప్రవేశించినా నేటికీ వర్షం జాడలేదు. అడపాదడపా అక్కడక్కడా పడుతున్న వర్షం లెక్కల్లోకి రాదు. వర్షాలు ముఖం చాటేస్తే జలాశయాలు వట్టిపోతాయి. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం కలసివచ్చినా ధరలు రాక నష్టపోతున్నారు. వర్షాలు పడని సంవత్సరంలో పంటలు ఎండిపోయి నష్ట పోతున్నారు. కాలం అయినా గాని, కరువు అయినా గాని రైతుకు మిగిలేది అప్పులే. నిపుణుల సలహాతో వ్యవసాయరంగాన్ని పారిశ్రామిక రంగంగా అభివృద్ది చేయగలిగితే దేశం ఆర్థికంగా బలోపేతం కాగలదు. గతంలో లాగా వాగులు వంకలు పొంగే పరిస్థితి లేదు. వర్షాల తీరు ఇలాగే ఉంటే నీటి కష్టాలు తప్పేలా లేవు. ఇలాంటి సందర్భాల్లోనే ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలి. పాలకులకు దూరదృష్టి అవసరం. నదీజలాలలను ఏటా వృధాగా సముద్రంలోకి వదలాల్సిన దుస్థితి నుంచి బయటపడాలి. వాటిని సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేయాలి. నదీ జలాలలను దేశం మొత్తానికి అందేలా...ప్రణాళికలు రూపొందించాలి. నదుల అనుసంధానంపై చర్చించాలి. దీనిపై సమగ్ర నివేదికలు రూపొందించాలి. నిపుణలను నియమించి గంగా,యమున,బ్రహ్మపుత్ర నదులను అనుసంధానించే ప్రక్రియ చేపట్టాలి. ఈ దశలో నీటి సంరక్షణతో పాటు, రైతు సంక్షేమానికి చర్యలు తీసుకునే ప్రణాళికలు ముందుకు సాగాలి. మోడీ తొలినాళ్లలో నదుల అనుసంధానం గురించి మాట్లాడారు. కానీ ఇప్పుడా మాట ఎత్తడం లేదు. ఇకపోతే వర్షాల ద్వారా మనం పాఠాలు నేర్చుకోవాలి. వరదలను నివారించి, నీటిని నిల్వ చేసుకునే పద్దతలను అవలంబించాలి. దేశవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగుతున్న సమయంలో వాటిని జలాశయాల్లోకి మళ్లించేలా ప్రణాళికలు చేసుకోవాలి. ఉన్నకొద్దిపాటు ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల చేయడంతో మళ్లీ సముద్రంలోకి నీరు చేరుతోంది. ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో దేశంలో నీటి యాజమాన్యం సరిగా లేదని ఏటా కురుస్తున్న వర్షాలు స్పష్టం చేస్తున్నాయి. దీనికితోడు అనేక జలాశయాల్లో పూడిక పేరుకుని పోతోంది. ఏటేటా వర్షాలతో ఒండ్రు చేరుతోందని నిపుణులు చెబుతున్నారు. గతంలో వరదలకు ఉత్తరాది, దక్షిణాది అన్న తేడా లేకుండా అనేక నదులు ఉప్పొంగాయి. చివరకు మళ్లీ నీరు సముద్రానికి చేరింది. ఈ దుస్థితి పోవాలంటే నీటి యాజమాన్యం అవసరం. ఇప్పటికైనా పాలకులు జాతీయ జలవిధానం రూపొందించాల్సి ఉంది. అలాగే వ్యవసాయం పై కూడా జీతాయ విధానంతో ముందుకు సాగాలి. వ్యవసాయాన్ని లాభసాటి చేసేలా, దిగుబడులు పెంచుకునేలా రైతులను ప్రోత్సహిచేలా చూసుకోవాలి. వివిధ రాష్ట్రాల్లో చెరువులను కబ్జాకోరులు మింగిన పాపానికి ఏటా కురుస్తున్న వర్షాలకు నగరాలు, పట్టణాలు, గ్రామాలు నీట మునిగిపోతున్నాయి. ఇదంతా పాలకుల పాపం కాక మరోటి కాదు. ఈ క్రమంలో గొలుసుకట్టు చెరువులను రక్షించు కోవాలి. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని కనీసం ఇప్పటి నుంచయినా నీటి అవసరాలను గుర్తించి పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. వర్షపునీటిని ఒడిసి పట్టుకుని ముందుకు సాగేలా ప్రణాళికలు చేసుకోవాలి. ఇది రాష్ట్రానికి, దేశానికి కూడా వర్తించేలా ఉండాలి. దేశ జనాభా పెరుగుతున్న క్రమంలో మన వ్యవసాయాన్ని బలోపేతం చేసుకునే దిశగా ఆలోచనలు చేయాలి. వ్యవసాయ ఉత్పత్తులను పెంచి విదేశాలకు ఎగుమతి చేసే విధంగా సన్నద్ధం కావాలి. ఆర్థికమాంద్యం ముంచుకొస్తున్న వేళ కేంద్రం ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటే ఓ పదేళ్లకు కాని ఆచారణలోకి రాదు. వ్యవసాయరంగం పురోగమిస్తే, ధాన్యం దిగుబడులు తగ్గితే తప్ప భారత ఆర్థికరంగం పురోగ మించదు. ఇప్పటికే వరిధాన్యం ఇబ్బడి ముబ్బడిగా పండించడం వల్ల గోదాముల్లో మగ్గి పోతోంది. వాటిని వాడుకునే విధంగా కార్యక్రమాలు అమలు చేసుకోవాలి. అదేపని గా వరి పండించకుండా ఇతర పంటలపైనా ప్రోత్సాహం కల్పించాలి. వంటనూనెల కోసం విదేశాలపై ఆధారపడకుండా దేశీయంగా నూనెగింజల ఉత్పత్తులను పెంచుకోవాల్సి ఉంది. ప్రధానంగా అనేకరకాల పప్పు ధాన్యాలు, వంట నూనెల దిగుమతులను పూర్తిగా నిషేధించుకుని, దేశీయంగా పండించుకునేలా వ్యవసాయాన్ని ప్రోత్సహిం చాలి. కనీసం ఓ పదేళ్ల పాటు వ్యవసాయరంగ ఉత్పత్తులపై దృష్టి సారిస్తే భారతదేశం ఆర్థకంగా మళ్లీ పుంజుకోగలదు. ఆధునిక వ్యవసాయం దిశగా పురోగమించాలి. రోజురోజుకూ నిరుద్యోగం పెరిగడంతో.. ప్రజలు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. వారిని వ్యవసాయం వైపు మళ్లించేలా పథకాలు చేపట్టాలి. తక్షణ ఉపాధికి ఇదొక్కటే ప్రత్యామ్నాయం కాగలదు. దీంతో ఆహార ఉత్పత్తులు కూడా పెరగ గలవు. కరువులు వచ్చినా, అధికంగా వర్షాలు కురిసినా రైతుల దుర్భర పరిస్థితులలో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. మరోవైపు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు పట్టణాలకు వలస వెళ్లి దినసరి కూలీలుగా మారు తున్నారు. చిన్నాచితక వ్యాపారాలతో తోపుడు బళ్లు నడుపుతున్నారు. వ్యవసాయ భూమి లేని కూలీలు కౌలుకు తీసుకొని నష్టాలపాలయి బ్రతుకునీడ్చ లేక,అవమానం భరించలేక, చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇప్పుడు అనేకమంది మళ్లీ వ్యవసాయం వైపు మళుతున్నారు. వారి శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకునేలా చేయాలి. ఈ క్రమంలో విదేశాలకు భారీగా ఎగుమతి చేసేలా పంటలు పండించగలగాలి. దీంతో మనకు విదేశీమారకం కూడా ఆదా కాగలదు. అలా పంటలు పండించే సత్తా మన రైతాంగానికి ఉందని గుర్తుంచుకోవాలి. మన రైతులనే ప్రోత్సహించి మన పంటలనే కాపాడుకునేలా రైతాంగ విధానాలు వస్తే తప్ప వారు బతికి బట్ట కట్టేలా లేరు. రైతుల సమస్యలను పట్టించుకునే దిశగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఏటా ఒక విధానంగా గాకుండా, రుణ మాఫీలు అవసరం లేని విధంగా రైతులు స్వయం సమృద్దిగా ఎదిగేలా చేయాలి. రైతుల సమస్యలు రాజకీయ పక్షాలకు ప్రచార కార్యక్రమంగానే మిగిలిపోయాయి. పాలకపక్షం అయినా, ప్రతిపక్షం అయినా రైతుల సమస్యలను పరిష్కరిం చడానికి చిత్తశుద్ధితో ఆలోచించడం లేదు. గిట్టుబాటు ధరలు లేక వచ్చిన ఆదాయం కూలీల ఖర్చుకు సరిపోతుంది.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com